# మగ పెళ్ళివాళ్ళం

ఆంధ్రపత్రిక

---

పెళ్ళి, పురుడు, పండగ ఇవి ఎంతో
ఆనందంతో జరగాల్సిన సరదాలు
కానీ
ఈ అపురూపమైన ఆనందాల్ని కేవలం డబ్బుకోసం
మనం ఎందుకు కోల్పోతున్నాం ?

\- జయప్రద

---

"శ్రావణీ ! పాప పెళ్ళి చాలా ఘనంగా చేసారే మీవారి చేతికి ఎముకే లేదని అందరూ అనుకోవడమే."

స్టోర్ రూమ్‌లో నేలమీద చతికిలబడి చుట్టూ స్వీట్స్ బుట్టలు పెట్టుకుని బంధువులకు వాటిని పంచడానికి చేతిలోని కవర్‌లోకి స్వీట్స్ తీసుకుంటున్న శ్రావణి కళ్ళెత్తి చూసింది.

చక్కబెట్టాల్సిన పనులన్నీ చేసి శ్రావణి యిచ్చిన స్వీట్స్ కవర్‌తో వెళ్ళబోతున్న నేను ఆగి నా బాల్యస్నేహితురాలి కళ్ళల్లోకి చూసాను. ఆ కళ్ళల్లో, ఆ కళ్ళల్లో కదలాడే భావంలో పొగడ్త విన్న ఆనందంలేదు.

"చాలా ఖర్చయ్యింటుందే" అంటున్న నాకు వెంటనే జవాబు అందింది,

"మూడు లక్షలు"

అలా అంటున్న స్నేహితురాలి కంఠంలో గర్వం ధ్వనించక కల వరపడ్డాను. నా చూపులు శ్రావణి పెదాలమీదకు వాలాయి. ఆ పెదాలు ఏదో దాస్తున్నట్టుగా, విచ్చీ విచ్చని చిరునవ్వుతో, చెప్పీ చెప్పని భాషతో కొద్దిగా సాగి ఆగాయి.

"ఏంటి శ్రావణీ అలా వున్నావు ?"

"పెళ్ళి బడలిక కదా !"

"ఇవన్నీ రేపు సర్దుకోకూడదూ ! వచ్చి కాస్త రెస్ట్ తీసుకో దా" కుడిచేతిలోని స్వీట్స్ కవరు ఎడం చేతిలోకి తీసుకుని కుడిచేత్తో శ్రావణి చేతిని పట్టుకుని లేవదీయబోయాను.

"కాదులే బిందూ ! ఈ రోజే ఈ స్వీట్స్ బంధువులందరికీ పంచక పోతే ఎండిపోతాయి."

"పోనిద్దూ ఏదో పద్ధతికోసం పంపిస్తున్నాం. ఎండిపోయినవని వాళ్ళు బాధపడతారని, మన ఆరోగ్యాలు పాడుచేసుకుంటామా ?"

శుష్కంగా నవ్వింది శ్రావణి. 'తనకు .... తనకు కావాల్సింది ఈ క్షణంలో శారీరక విశ్రాంతికాదు?' అనే భావాన్ని ఆ చిరునవ్వులో చూసాను.

"ముందు లే చాలా నీరసంగా వున్నావు, పాపేదీ కన్పించదే"

"నిరూపా ? ఎక్కడో లోపలున్నట్టుంది."

ఆ మాట అంటున్నప్పుడు శ్రావణి గొంతు కంపించింది. పెళ్ళి అంటే సవాలక్ష ఆవేదనలుంటాయి సర్దుకోక తప్పదు. నిట్టూర్చి కదలబోతూ అన్నాను.

"పతే అయితే ఒక్కసారి నిరూపని కలిసి వెళ్ళిపోతాను. నువ్వు రెస్ట్ తీసుకో."

వెర్రిచూపులు చూసింది శ్రావణి.

ఆ కళ్ళల్లో నీళ్ళు నా కనుచూపును దాటిపోలేకపోయాయి– శ్రావణి బర్స్ట్ అయింది.

"ఏమైంది ? ఏమైంది శ్రావణీ ?" భయంగా చూసాను. చేతిలో స్వీట్స్ కవరు క్రిందపెట్టి అక్కడే ఆ బుట్టల మధ్యలో బోర్లించిన చిన్న బిందెమీద కూర్చున్నాను.

శ్రావణి బలవంతంగా ఏడుపు నాపుకోవడానికి ప్రయత్నిస్తోంది. ఇప్పుడు ఈ ఏడుపు వినిపించకూడదు. ఇలాటప్పుడు ఆమె ఏడుపుకి అర్థాలు ఎవరికి తోచినవి వాళ్ళు తీస్తారు.

"శ్రావణీ! ప్లీజ్ రిలాక్స్ !"

కళ్ళు తుడుచుకుంది శ్రావణి.

"ఏమీలేదులే బిందూ నువ్వెళ్ళు. భవిత నీ కోసం ఎదురు చూస్తుంటుంది."

"ఫర్వాలేదు చెప్పు. జరగకూడనిదేమీ జరగలేదు కదా !"

"లేదులే" విరక్తిగా అని లేచి నిలబడింది శ్రావణి.

"సరే, సాయంత్రం వస్తాను నీకూ సహాయం చేసినట్లుంటుంది నిరూప వెళ్ళాక మనం మాట్లాడుకుందాం."

"అలాగే – ఎన్ని గంటలకు వస్తావు ?"

"ఆరు గంటలకు వచ్చేస్తా"

"ఏవిటో శూన్యంగా వుంది బిందూ ! త్వరగా వచ్చెయ్యవా ?"

"అలాగే వచ్చేస్తాను" అనేసి కదిలాను—పాతిక లక్షల కట్నం ఇచ్చి మూడు లక్షలు ఖర్చుపెట్టి పెళ్ళిచేసిన శ్రావణిలో ఎందుకీ శూన్యం?

* * *

"ఏమ్మా ! ఇంతాలస్యం ?" వాకిట్లోనే ఎదురొచ్చి కోపంగా అంది భవిత.

"భోంచేసావా ?" అడిగాను నడుస్తూనే.

"ఈయన వచ్చారు" స్వరం తగ్గించి అంది భవిత.

నా కాళ్ళలో చలనం ఆగిపోయింది. నా చేతిలోని స్వీట్స్ కవరు బరువైంది.

ఎంత దయనీయమైన స్థితి ఇది. ఆనందంతో ఎదురెళ్ళి ఆప్యాయంగా పలకరించి, మనస్ఫూర్తిగా మర్యాదలు చేయాల్సిన తనలో ఈ ఆందోళన ఏమిటి ?

"ఆయన భోజనానికొస్తే ఒక్క మంచి కూరన్నా లేదు" తన చేతిలోని కవరు అందుకుంటూ కంప్లెయింట్ చేసింది భవిత.

'ఇలాటి కంప్లెయింట్స్ ఇక ఎన్ని వినాలో ఈ నాలుగు రోజుల్లో!' నిశ్శబ్దంగా నిట్టూర్చి అన్నాను.

"నాకు తెలియదుకదా అల్లుడు వస్తున్నట్టు నువ్వయినా చికిన్ తెప్పించి చేసి పెట్టకపోయావా ?"

"ఆయన నన్ను వదిత్తేకదా !" భవిత కళ్ళు గర్వంతోనూ సిగ్గుతోనూ వెలిగాయి. నా కనుపాపలు అసహనంతో కదిలాయి. ఏవిటి నాలో ఈ భావవేదన ? కూతుర్ని బాగా చూసుకుంటున్న అల్లుణ్ణి మనస్ఫూర్తిగా ప్రేమించలేని ఈ బలహీనత ఏవిటీ ? నా అంతరాంతరాల్లో దానికి జవాబు సిద్ధంగా వుంది.

తన కూతుర్ని అపురూపంగా చూసుకునే అల్లుడు కంచంలో కూర

మంచిదిలేదని అలిగే వుంటాడు. లేకపోతే కూతురి నోటివెంట ఆ తొలి ఫిర్యాదు రాదు. అది తనకు తెలుసు.

"రా స్వీట్స్ పెట్టిస్తాను తీసుకెళ్లవు"

"నువ్వే తీసుకురా పలకరించినట్టూ వుంటుంది"

ఏ అత్తకు అల్లుణ్ణి పలకరించాలనుండదు ? అసలు అల్లుడెవరు ? ఈ ఇంటి కేమవుతాడు ? జీవితమంతా కలిసి వుండాల్సిన మనిషికాదూ ! తన కొడుకులాటివాడు కాదూ ! పెళ్ళయిన కొత్తలో ఈ ఇంటికొచ్చిన మరో బిడ్డగా అతనితో ఎన్నిసార్లు మాట్లాడలేదు ! కానీ ఈ రోజు అతన్ని పలకరించడానికి తనలో ఈ ప్రతిఘటనా భావమేవిటీ ?

ఏమి మాట్లాడితే ఏది తప్పు పడ్తాడోననే భయం ఎలా ప్రవర్తిస్తే తన అల్లుణ్ణి ప్రసన్నం చేసుకోగలదో తెలీని అయోమయావస్థ. ఇది తనకు తన అల్లుడు కల్పించిన దురవస్థ.

ఇరవై ఏళ్ళు తన కళ్ళల్లో పెట్టుకుని పెంచిన తన కూతురు ఆ కళ్ళల్లోని భయాల్ని గమనించీ గమనించనట్టే వెళ్ళిపోయింది. ఎంత నిర్దయులు ఈ ఆడపిల్లలు !

షోకేస్ తీసి అందులో అల్లుడికోసంగా ప్రియంగా కొనిపెట్టుకున్న ప్లేట్లు అందుకున్నాను. కొద్దిగా చేతులు వణికాయి. ఆ ప్లేటు క్రిందపడి ముక్కలయిపోతుందేమోనని కాదు ఆ భయం ఆ మెరిసే గోల్డ్ కలర్ రిమ్ నచ్చిన పింగాణీప్లేట్లో ఈ స్వీట్స్ పెడ్తే వెండి ప్లేటు ఇవ్వలేదనే విషయం మరలా గుర్తు చేస్తాడేమోననే భయంతో వణికాయి.

అదృష్టం బాగుంది ఆ మాట అనలేదు జామాత.

శ్రావణి ప్రేమతో ఇచ్చిన నాలుగురకాల స్వీట్లు, రెండు రకాల హాట్లు, భయంతో అణకువగా అల్లుడి ముందుంచి తిరిగి రాబోతూ ఆగాను.

'అమ్మో ! ఏదో ఒకటి పలకరించకపోతే రెండో ఫిర్యాదు కూతురి నోటివెంట పంపడూ !'

"దేంట్లో వచ్చావు నాయనా ?"

"మీ రిచ్చిన కార్లో"

తృళ్ళిపడ్డాను. అది జోక్ కాదు. అతను నవ్వడంలేదు. భవితవైపు చూసాను. ఆమె ముఖం క్షణంలో మలినమైంది.

'తన భార్య తల్లిదండ్రుల్ని ప్రేమిస్తే .... కనీసం గౌరవిస్తే తన భార్య, గుండెల్లో తనమీద కొండంత ప్రేమ, కృతజ్ఞత అలల్లా పొంగు తాయనే అందమైన సత్యం అల్లుళ్ళకు ఎందుకు తెలీడంలేదు ? !'

కానీ తనకు తెల్సు. తను ఆ రూమ్‌లోనుండి బయటపడ్డ మరుక్షణం తన కూతురికి సారీ చెప్పి వమరుక్షణం భార్యను ప్రసన్నం చేసుకుంటాడు. కానీ కొద్దికొద్దిగా ముక్కలవుతున్న తన గుండె మాటేమిటీ ? అలసి పోతున్న తన మనసును ఓదార్చేదెవరు ? సంతోష సాగరంలోవున్న తన ఏకైక పుత్రికా ? లేక స్వర్గంలోవున్న తన భర్తా ?

తన కళ్ళు చెమ్మగిల్లినా అల్లుడి గుండె చెమ్మగిల్లలేదు. నిప్పుల గుండంలాంటి బెడ్‌రూమ్‌లోనుండి బయటకొచ్చి లివింగ్‌హాల్‌లో మంచం మీద వాలిపోయాను.

నాలో ప్రశ్నలు – ఎన్నెన్నో ప్రశ్నలు.

వాళ్ళు అడిగిన పదివేల కట్నం ఇచ్చింది. పదికాసుల బంగారం పెట్టింది. పెళ్ళి వున్నంతలోనే ఘనంగా చేసింది. మరిదేమిటి ? ఒకప్రక్క వియ్యాంకురాలు, ఒక ప్రక్క అల్లుడు, మరోప్రక్క భవిత ఆడబిడ్డ అందరూ కలిసి తనని, ఒంటరి ఆడదాన్ని ఎందుకిలా గొంతెమ్మ కోరికలతో చిత్రవధ చేస్తున్నారు ? తన భర్త సంపాయించిన ఈ ఇల్లు తప్ప తన కింకేమీ మిగలలేదు. తనకూ తన పదేళ్ళ కొడుక్కి అదే ఆధారం. వంటకి

ఒక పంచ దింపి పైనున్న ఒకే ఒక్క గదిలోకెళ్ళి క్రింద బాడుక్కివ్వక పోతే ఇల్లు జరిగే పరిస్థితి కాదు. ఏదో నాలుగు ప్రైవేట్లు చెప్పుకుని కొడుకుని చదివించుకుంటోంది. ఇలాటి రోజుల్లో మొదటి పండక్కి, దీపావళికి అల్లుడు స్కూటర్‌కి ఇండెంట్ పెడ్తే తనెలా తెచ్చివ్వగలదు ? ఆ మాటే తన కూతురితో అంది. అది భవిత అల్లుడికి చెప్పివుంటుంది. అందుకే ఆ వ్యంగ్య బాణం. ఆ బాణంకంటే తన గుండెల్లో చురుగ్గా గుచ్చుకున్నది తన కన్నకూతురన్నమాట "అల్లుడన్నాక ఆ మాత్రం అడగడా ?"

* * *

అలిగిన అల్లుడు వెళ్ళిపోయాడు. నలిగిన మనసుతో శ్రావణిని చూడాలనే కోరికతో ఆ సాయంత్రం మరలా పెళ్ళి ఇంటికొచ్చాను. పిల్లల కేరింతలుతప్ప ఆ ఇంట్లో నాకు పెళ్ళికళ కన్పించలేదు. ఎవరికి వారే నిశ్శబ్దంగా వున్నారు. శ్రావణికోసం మేడమీద కెళ్ళాను. నా కళ్ళు వెలిగాయి. అక్కడ నా స్నేహితురాలు దివ్య.

"దివ్యా ! నువ్వెప్పుడొచ్చావు ?"

"ఇప్పుడే....ఎంత ప్రయత్నించినా పెళ్ళికి రాలేకపోయాను. పెళ్ళి బాగా జరిగిందా ?"

"ఆఁ. ప్రొద్దున పెళ్ళిలో నిన్నేతల్చుకున్నాం. ఎందుకని రాలేదు?"

"కవితకు కాన్పయింది"

"అరెఁ ఎప్పుడు ?"

"నిన్న....అమ్మమ్మ పోస్టు వచ్చిందికదా ! బిజీ... బిజీ అందుకే పెళ్ళికి రాలేకపోయాను" నవ్వేసింది దివ్య.

"సరే రా. శ్రావణికి సాయం చేద్దాం. అసలెక్కడుంది తను ?"

"శోభనం గదిలో" చిన్నగా నవ్వింది దివ్య.

ఇరవై ఏళ్ళు పదిలంగా పెంచుకున్న కూతురికి కొత్త జీవితాన్ని ఇవ్వబోతున్న సమయంలో పడకమీద కొత్త వైట్ వెల్వెట్ బెడ్‌షీటు పరుస్తోంది శ్రావణి. ఆమెకు ఆ చిన్నపనే చాలా పెద్దదిగా అనిపిస్తున్నట్టుంది ఆ బెడ్‌షీటు సరిగ్గా పరవలేకపోతోంది.

"ఉండు. నే నీ ప్రక్క పట్టుకుంటాను. ఆ సైడ్ నువ్వు టక్ చెయ్యి" అంది దివ్య.

"పూలవాళ్ళు అలంకారం చేయాలని తొందర పెడ్తున్నారు ?.... ఏవిటో...." అలా అంటున్న శ్రావణివైపు చూసాను. ఆమె కళ్ళల్లో తన చిన్నారి కూతురి కొత్తకాపురం గురించిన కోటి కలలు లేవు.

"నిరూప అత్తగారింటి కెప్పుడెళ్తుంది ?"

"నిరూపా ?....ఎల్లుండి" శ్రావణి జవాబు చెప్పిందికానీ ఆ జవాబు స్పృహలో వుండి చెప్పినట్లు లేదు.

"అయితే ఇప్పుడు మేము చేసే పనేమీ లేదుగానీ ఎల్లుండి ఉదయమే వస్తాము. స్వీట్స్ చేసేదగ్గర కాపలా వుండాలికదా ?" దివ్య అంది.

"వెళ్ళిపోతారా ?" ఏదో ఆధారంకొరకు వెతుకుతున్నట్టుగా ఆ ఆధారం జారిపోతున్నట్టుగా ఆమె కంఠంలో భాషకందని భావం.

"నీతో కాస్సేపు నిదానంగా మాట్లాడ్డానికుండదు ఈ హడావుడిలో. ఇంటినిండా చుట్టాలు. వాళ్ళనందర్నీ చూసుకో. రేపొస్తాంలే"

"అసలు నే నుందామనే అనుకున్నాను. కానీ ఇంటికెళ్ళేసరికి అబ్బుడు. ఇదిగో దివ్యకు మనమరాలు పుట్టిందట. అటు హాస్పిటల్‌కెళ్ళి చూసేసి ఇంటి కెళ్ళిపోతాను శ్రావణీ. ఏమీ అనుకోకూ...."

"అనుకునేదేముందిలే. నువ్వేమిటీ అలా వున్నావు"

"ఏమీలేదు" స్నేహితురాలి దగ్గర కూడా ఏమిటో ఈ భేషజం' కోపంతో కూతుర్ని వదిలేసి వచ్చిన మనస్సు గంటన్నా కాలేదు వెన్నెలా కరిగిపోయింది. ఈ గుండె రాయి అయితే ఎంత బాగుండేది ? ఇలా నా కోసం ఆరాటపడే స్నేహితురాల్ని వదిలి తనని అర్థం చేసుకోని కూతురికోసం పరుగెట్టేదా ?

"అయితే కవిత కాన్పు అయిపోయిందన్నమాట", దివ్య భుజంమీద చెయ్యివేసి కదిలింది శ్రావణి - మాట్లాడే బొమ్మ మాట్లాడినట్లు, నడిచే బొమ్మ కదిలినట్లూ ...

* * *

"అదేవిటీ కవిత ఒక్కతే వుందీ ?" ప్రశాంతి నర్సింగ్‌హోమ్‌లో బి వార్డులో మొదట అడుగు పెట్టిన నేను తెల్ల బోతూ అన్నాను. కంగారుగా అడుగుబెట్టింది దివ్య.

"మీ అత్తా వాళ్ళేరే ?"

"వాళ్ళకేం బట్టిందీ ?" కోపంగా అంటున్న కూతురివంక బేలగా చూసింది దివ్య.

"వాళ్ళున్నారని కాస్సేపు నిరూపని చూసొద్దామని అలా వెళ్తే అప్పుడే వాళ్ళు వెళ్ళిపోవాలా ?"

"నేను నీ కూతుర్నా ? వాళ్ళ కూతుర్నా ? నువ్వు ఊళ్ళు ఏలడానికెళ్తే వాళ్ళు నాకు, నా బిడ్డకూ కాపలా కాయాలా ?"

భయంతో బిగుసుకుపోయింది దివ్య.

అంటే ... అంటే దివ్యకేగానీ, కవిత వాళ్ళకేమీ కాదా ? వాళ్ళకి మనమరాల్ని - తన కొడుక్కి కూతుర్ని కనిచ్చిన ఈ పురిటి మంచం మీదున్న ఈ కొత్త తల్లి వాళ్ళకేమీకాదా ? ఈ రోజు పురిటిమంచం

సేవలు చేయడానికి రేపు పురుడు స్నానం చేయించి బారసాల చేయడానికి- బిడ్డ ఒంటిమీద బంగారం పెట్టడానికీ పనికి వచ్చే దివ్యకు మనమరాలిమీద మాత్రం రేపు హక్కు వుండదు. ఇదేమి న్యాయం !

నాలో రేగిన యీ ప్రశ్నలు కవిత నడగలేదు దివ్య.

"పెళ్ళయి సంవత్సరమన్నా కాలేదు దివ్య తన కూతురు ఎడల ఎంత పరాయి భావం పెంచుకుందీ !"

"చూడండాంటీ అమ్మ ఇలాటి పనులు చేస్తుంది.... ఆ తర్వాత వాళ్ళ దెప్పిపొడుపులు నేను పడాలి.. "

"వచ్చేసిందిగామ్మా, వాళ్ళకు మీ అమ్మ రేపు సారీ చెప్పుకుంటుందిలే బాధపడకు" ఈ మాటలు నా మనస్సు పొరలనుండి దూసుకు రాలేదు. నిజం ఒప్పుకోవాల్సి వస్తే ఎదురు తిరిగిన మనస్సును అదుపులో పెట్టుకుని అన్నాను.

'బాల్య స్నేహితురాలి కూతుర్ని పెళ్ళికూతురిగా చూడాలనే గాఢ మైన కోరికతో ఓ అరగంట కాలాన్ని తన కోసం వెచ్చించుకోవడమేగా దివ్య చేసిన ఘనమైన నేరం... దానికేనా వియ్యంకులలిగింది.'

జీవితకాలపు బంధువులైన ఈ వియ్యంకులు కలకాలపు శత్రువుల్లా ఎందుకు ప్రవర్తిస్తారు ? రేపు నేనూ యింతేనా ? ఎంత చిత్రం ఇంత దగ్గర బాంధవ్యంలో మనసుల మధ్య ఎంత దూరం ?

దివ్య ఏమీ మాట్లాడలేదు ఆమె మౌనంగా బయట కొచ్చింది ఆమె కళ్ళనిండా నీళ్ళు –

"ఛ. ఇంత చిన్నవాటికేనా ? ఇలాటివి మనకు తప్పవు' దిగులు పడకు వాటికవే సర్దుకుంటాయి."

"నేను తప్పే చేసాను" కళ్ళు తుడుచుకుంటూ అంది దివ్య–

"ఛ. నీకు మతిపోయిందా ఏమి? ఇందులో నువ్వు చేసిన తప్పేమీ లేదు కాకపోతే ఆడపిల్లను కన్న తల్లివికదా! నాలుక చివర్న క్షమాపణల దొంతర్లని పేర్చుకుని అవసరమైనప్పుడు ఒక్కొక్కటి వదులుతుంటే సరిపోతుంది."

దివ్య వరండాలో నేలమీద కూర్చుంటూ అంది.

"కాదులే బిందూ నాదే తప్పు కాన్పుకి ఇంకా పదిహేను రోజులు టైముంది. సూడిదలు పెట్టి తీసుకురావాలంటే చేతిలో డబ్బులేదు దానికోసం ప్రయత్నిస్తూ ఆలస్యమయిపోయింది. ఇంతలో నొప్పులొచ్చాయి. వాళ్ళత్త ఫోన్ చేయించింది ప్రక్కింటికి. అవీ ఇవీ సర్దుకుని హాస్పిటల్ కొచ్చేసరికి కొద్దిగా లేటయింది. రిసెప్షన్‌లో అడ్వాన్స్ అడిగారట ఐదొందలు వాళ్ళే కట్టారు–"

అబ్బా! దానికి మునిగిపోయిందేముంది? డిస్చార్జి అయ్యేలోపల నువ్వు సర్దుబాటు చేస్తే సరి."

"అసలే కడుపు సారె తీసుకెళ్ళలేదని కోపంగా వున్నారు ఇప్పుడిదొకటి వచ్చింది" దిగులుగా అధైర్యంగా, అసహాయంగా దివ్య చూసిన చూపు నన్ను విచలితురాల్ని చేసింది –

ఏమి లాభం, నేనేం సహాయం చేయగలను? ఏం సలహా ఇవ్వగలను? ఏదైనా సలహా ఇస్తే వియ్యంకుల్ని పట్టించుకోవద్దని ఇవ్వాలికానీ మొదట ఆ వాక్యంలోని అర్థాన్ని తను ఆచరణలో పెడితే అప్పుడు ఆ సలహా యిచ్చే హక్కు తనకుంటుంది.

"ఐదొందలు మా వియ్యపురాలి చేతిలో పెట్టానే, విసిరి నా మొహాన కొట్టింది" అదీ యీ పిల్ల బాధ.

"పోనీలే ఐదొందలు మిగిలాయని సంతోషపడు" అన్నాను. నా మనసు కుతకుత వుడికిపోతోంది.

ఈ ఐదొందల బదులు ఐదువేలు తీసుకునే ప్లాన్ వేయగల సమర్థులు" అని నిట్టూర్చింది.

"అప్పటికే డాక్టరుగారి దగ్గరకెళ్ళి ఐదువందలిచ్చాను వాళ్ళ అడ్వాన్స్ వాళ్ళ కిచ్చేయమని."

"తీసుకున్నారా ?"

"నర్స్‌చేత పంపారట డాక్టరుగారు. వాళ్ళు తీసుకోలేదట. రూమ్‌లో అంతసేపుంటే నావైపన్నా చూడలేదు. పలకరించినా పలకలేదు అందుకని వాళ్ళున్నారుకదా అని అలా వచ్చాను. రాకుండా వుండాల్సింది."

అంటే ... అంటే ముఖంమీద దిగుల్ని చమటతో కడుక్కొని వేదనను పౌడర్ వెనుక దాచుకుని శ్రావణిదగ్గర కొచ్చిందన్నమాట దివ్య ...

నాకు చాలా కోపం వచ్చింది దివ్య వియ్యంకురాలిమీద. చాతకాని కోపం ....

"ఏం మునిగిపోలేదులే దిగులుపడకు. కూతుళ్ళకు పెళ్ళిళ్ళు చేసేసామని ఇక మనకు జీవితాలుండవా ? మనకంటూ వేరే పనేదీ వుండదా ?"

దివ్యను ఓదార్చానేగానీ తల్లిగా బిడ్డకు కావ్వయితే ఆ బిడ్డ దగ్గరుండి ఆ బిడ్డకు, బిడ్డ బిడ్డకు సేవలు చేయడంకంటే సంతోషం మరే పనిలోనూ వుండదు. మరేమయినా పనులున్నా వాటిని తాత్కాలికంగా విస్మరించొచ్చు. కానీ ఎదుటి మనిషి మన ఉనికిని విస్మరిస్తుంటే మనల్ని పురుగులా చూస్తుంటే వాళ్ళ పరిధినుండి పారిపోయి ఇంకెక్కడయినా ఓ పది నిముషాలు మనశ్శాంతి కొనుక్కోవడం దురన్యాయం కాదూ?

"అది కాదులే బిందూ ! వాళ్ళసలే హాట్‌గా వున్నప్పుడు నేనలా

చేయాల్సిందికాదు. రేప్రొద్దున ఈ కోపం పెట్టుకుని బిడ్డకు ఎన్ని నగలు పెట్టమంటారో! .... బంగారం ధరమండిపోతోంది.ఈయన చేసేది గుమాస్తా ఉద్యోగం, జీతం తప్ప మరే ఆధారం లేదు. నీకు తెలియందేముందిలే..."

నాకు దివ్యమీద జాలేసింది తర్వాత నవ్వొచ్చింది. తనది జాలిపడే పరిస్థితేనా ? దివ్య భర్తకు గవర్నమెంటు ఉద్యోగమయినా వుంది కానీ తనకీ .... తుమ్మితే వూడిపోయే ముక్కులాటి ప్రైవేట్లు .... బంగారం గురించి ఆలోచించే సాహసమే లేని బ్రతుకు...

ఇప్పుడు నామీద నాకే జాలేసింది. మనమీద మనం జాలిపడడం కంటే దయనీయమైన స్థితి మరొకటుండదు.

"దిగులుపడకు అన్నీ సర్దుకుంటాయి."

"అలా అన్నానేకానీ ఇలాటి పరిస్థితులు ఎప్పుడు సర్దుకుంటాయో నాకు బాగా తెలుసు వియ్యంకుల కోరికలు చిరునవ్వుతో తీర్చిన రోజు ... వాళ్ళ బాసిజమ్‌కి దివ్య వ్యక్తిత్వం తలవంచిన రోజు ఆ రోజు సర్దుకుంటాయి."

నిట్టూర్పు విడవడం తప్ప ఏమీ చెయ్యలేని నిస్సహాయత నాది -

"ఏం సర్దుకుంటాయో! మధ్యలో పాపం కవిత నలిగిపోతోంది."

నవ్వొచ్చింది. కవితకాదు నలిగిపోయేది దివ్య లాలూకు తల్లి మనసు నలిగిపోతోంది.

"ఊర్కో దివ్యా ! ఏవిటి నువ్వూ నీ పిరికితనమూ వాళ్ళు నీ తల తీసి మొలేస్తారా ? .... కాకపోతే కవితను నాలుగు రోజులు పంపించరు అంతేకదా !" ఒళ్లుమండి అన్నాను.

"అమ్మో కవితను చూడకుండా నేనుండగలనా ?"

"వెల్ సెడ్ దివ్యా ! అదే.... ఆ బలహీనతే... ఆడపిల్లల తల్లి దండ్రుల ఈ బలహీనతే వాళ్ళకు వజ్రాయుధం - ఏం ? ఎల్లకాలం పంప కుండా వుంటారా ?"

"మన బిడ్డలు, తమ భర్తలమీద చూపించే పాతివ్రత్యపు ప్రేమలో పదోవంతు ప్రేమ మనమీద చూపిస్తే ... 'మా అమ్మను చూడందే నేను బ్రతకలేను. నీకు ఆనందమైన బ్రతుకునివ్వలేను' అని ఇసుమంత ఎదిరిస్తే .... అప్పుడు వాళ్ళ ఆటలు సాగవు."

దివ్య కళ్ళల్లో ఒకింత ధైర్యం. నిజానికి ఇది నేను నమ్మిన సిద్ధాంతం కాదు. నేను అమలుపరుస్తున్న సిద్ధాంతం - అంతకంటే ఏం చేయగలను ? అల్లుడికి మర్యాద చెయ్యడానికి చేతిలో పదహారు రూపా యలు లేని నేను పదహారు వేలుపెట్టి స్కూటరు కొనివ్వలేను కదా !

"స్కూటర్ కొనివ్వకపోతే పండుగాలేదు, పబ్బమూలేదు నువ్వు నాతో వచ్చెయ్" అన్న అల్లుడి మాటల్ని కూతురు తన నోటితో నాకు విన్పించినప్పుడు.

"అలాగే వెళ్ళరామ్మా. నా ఆశీర్వాదాలు తప్ప ఇక నీకు నేనేమీ ఇవ్వలేను" అంది. ఏ కళనున్నాడో ? .... లేక ఏ ఆరిపోని ఆశతో వున్నాడో భవితను వదిలేసి వెళ్లాడు.

"అంతేనంటావా ? వాళ్ళనెదిరించే ధైర్యం కవితకుందంటావా ?" దివ్య నిశ్శబ్దంగా ఆలోచనల్లో వున్న నన్ను తట్టి అంది.

"ఎదిరించాల్సినంత అవసరం రాదులే దివ్యా. నువ్వు అంతో యింతో బంగారంపెట్టి పంపిస్తావు కదా !" అన్నాను ఆవేశం తగ్గి,

ఎదిరించమని సలహాయిచ్చి ఆ తర్వాత అవతల వ్యక్తుల కుసంస్కారంవల్ల ఏదైనా జరగకూడనిది జరిగితే, ఆ తర్వాత దివ్య బాధ పడితే నేను చూడలేను.

అంతో ఇంతో ఏం? మాకు శక్తి వున్నంతవరకు.....ఇప్పటికి వాళ్ళు అడిగినంతా పెట్టి పంపిస్తామనుకో. తర్వాత ఇలాగే ఇది కొనసాగితే ..."

"అప్పుడు చూసుకుందాంలే."

దివ్య మాట్లాడలేదు

"అయితే నువ్వు ఎల్లుండి నిరూప అంపకాలకు రావన్నమాట."

"ఏమొస్తానో !"

*    *    *

ప్రియంగా పంధొమ్మిదేళ్ళు పెంచుకున్న కూతుర్ని తొలిసారిగా పరాయిదాన్ని చేస్తున్న అసుర సంధ్యవేళ, గుండెల్లో దిగులు చిక్కబడుతున్న వేళ ఆఖరిమెట్టుమీద నన్ను తేజస్వినీ్ని చూసిన శ్రావణి కళ్ళల్లో చిన్నకాంతి.

"మీరు రారనుకున్నాను .... రండి నీరూ వెళ్ళిపోతోంది" గబగబా మమ్మల్ని గదిలోకి తీసుకెళ్ళింది. అక్కడ మేముతప్ప మరెవ్వరూ లేరు.

"నువ్వు వెళ్ళవా ?" అడిగాను.

"రమ్మంటున్నారు, వెళ్లాలనిలేదు, మీతో వుండాలనుంది"

"బావుండదేమో నువ్వు రిసెప్షన్‌కెళ్ళకపోతే ...."

"అక్కడ నాకెవరున్నారు ?"

"ఛ, అలా అనకు నిరూప లేదూ"

"అహఁ, నా కూతురుగానే నిరూప నాకు కావాలి" ఏడ్చేసింది శ్రావణి.

"ఛ ! ఈ రోజుల్లో ఏవిటీ ? లే .... లేచి ముఖం కడుక్కుని తయారుకా అలా వెళ్ళివస్తే నీ మనస్సు కుదుటపడుతుంది. ఆడపిల్లల్ని కన్న అందరికీ ఈ క్షణంలో ఈ బాధతప్పదు. నిరూప ఎక్కడికిపోతుంది రెండురోజుల్లో తిరిగిరాదూ !"

"ఊహుం అలాకాదు నా నిధూ ఎప్పటిలా నా దగ్గరే వుంటే బావుణ్ణని వుంది" వెక్కి వెక్కి ఏడ్చింది శ్రావణి.

పెళ్ళవగానే ఆడపిల్ల పరాయిదయిపోయిన భావంతో తల్లి పడుతున్న ఈ మనోవేదనకు మందేదీ ?

'మంగళసూత్రం కట్టించుకున్న మరుక్షణంలో కొత్త వ్యక్తిని గుండెల్లోకి తెచ్చుకోవచ్చు. కానీ పాత తల్లిని పరాయిదాన్ని చేయడం ఏం సాంప్రదాయం ? దాన్ని పాటించమని మనం పాఠాలు చెప్పడం ఎంత దురన్యాయం ?'

నాకంటే ముందు తేజా తేరుకుంది.

తేజా శ్రావణికి ఇంటర్‌లో రూమ్‌మేట్. మాతోనూ స్నేహం పెంచుకున్న స్నేహపాత్రురాలు తేజా. శ్రావణిద్వారా మనసులో మాట చెప్పుకునేంత స్నేహం మాకూ తేజాతో వుంది.

"లే.... లేచి తయారుకా శుభమా అని ఆడపిల్ల కొత్త జీవితంలో కెళుతుంటే ఇలా కన్నీళ్ళు పెట్టుకోకూడదు నువ్వు."

"శ్రావణి కళ్ళుమూసి తెరిచింది. ఆ కంటిలో అల్లల్లాడుతున్న కన్నీరు ఒక్కసారిగా చంపలమీదుగా జారి కంటిని కడిగేసింది.

"నిజమే అలాగే అనుకుని సర్దుకోవాలని ప్రయత్నిస్తున్నాను తేజా! కానీ నా ఒక్కగానొక్క కూతురికి క్రొత్త జీవితాన్నిస్తున్న నేను నా జీవితాన్ని కోల్పోతున్నాను. ఈ సంగతి మీకెలా అర్థమవుతుంది ?"

"అర్థం కాకపోవడానికి ఇక్కడ మాకూ ఆడపిల్లలు లేకపోలేదు. కొన్ని తప్పవు. అంతా సర్దుకుంటుందిలే" మరలా తేజానే అంది.

నేను ఉలిక్కిపడ్డాను.

నేనూ దివ్యకు అంతా సర్దుకుంటుందనే ధైర్యం చెప్పాను. ఇక్కడ

తేజా అదే పదంతో శ్రావణికి ధైర్యం చెపుతోంది. కానీ తేజా చిరునవ్వు వెనుక జీవితంలో ఇలాటివెన్నో ? ఆమెకు ఎవరు ధైర్యం చెప్తారు ?

ఏది ఏమైనా నిరూప పదికాలాలపాటు మధురస్మృతిగా గుండెల్లో దాచుకోవాల్సిన ఈ రోజుని శ్రావణి దోచుకోకూడదు. ఆవేశంలో తీసుకున్న ఈ నిర్ణయాన్ని తాము సమర్థించకూడదు.

నేను నోరు విప్పాను నా చెయ్యి ఆమె కన్నీళ్ళు తుడిచింది.

"శ్రావణీ ! రాత్రికి మేమిక్కడే వుంటాము. నువ్వు వెళ్ళిరా. అక్కడ ఏం జరిగినా, శ్రోతగా, ప్రేక్షకురాలిగా మిగిలిపో — మన గుండెల్లో మాటలు పెదవి దాటితే పరిణామాలు బాగుండవు. నీ గుండె చల్లబడేదాకా నువ్వు ఏం చెప్పినా వినడానికి మేమున్నాం. వెళ్ళు శ్రావణీ త్వరగా రెడీగా !"

శ్రావణి కళ్ళల్లో, ఆ తడిలో మా ఈ చిన్న ఓదార్పుకు ఎంత కృతజ్ఞత ! ఈ వియ్యంకులు ఆ కృతజ్ఞతకోసం కొంత సంస్కారంతో ఎందుకు ప్రవర్తించరు ? ఇంత గొప్ప కృతజ్ఞతను, దాని తాలూకు స్నేహాన్ని ఎందుకు వదులుకుంటున్నట్టు వీళ్ళు !

"తేజా నీకు పనులేమయినా వున్నాయేమో ?"

శ్రావణి మాటల్లో ఎంత బేలత్వం తామిద్దరం తప్ప, తనని రక్షించడానికి మరెవరూ లేనంత ....

"నేనుంటాను నీకోసం వుంటాను. ఇంటికి ఫోన్‌చేసి చెప్తాలే."

"సరే" కదిలింది శ్రావణి.

* * *

నిరూపను శ్రావణి ఆడబిడ్డ బొమ్మలా తయారుచేసింది.

"మాకే ఇంత ముద్దొస్తున్నావు. మరి మీ ఆయనచూస్తే...." అని జోకులు వేసే వయసులు కావు మావి. కానీ అందానికే అందంగా వున్న తన భార్యను కని యిచ్చిన అత్తగారికి ఎన్ని కృతజ్ఞతాయుత నమస్కారాలు చెప్పాలి ఆ అల్లుడు ? చెపుతున్నాడా ? లేక తన అల్లుడిలాగ దివ్య అల్లుడిలాగ 'మీ అమ్మ' అని వేరు భావం చూపిస్తున్నదా ?

నిరూప గదిలోనుండి లివింగ్‌రూమ్‌లోకొచ్చాము. మా లివింగ్ రూమ్‌కి పదింతలు సైజ్‌వున్న ఆ రూమ్‌నిండా పెద్ద పెద్ద బుట్టలు వాటినిండా స్వీట్స్ — వాటిమీద ఆడపిల్లల్ని కన్న మధ్యతరగతి బ్రతుకుల నవ్వుల్లా ఆర్టిఫిషియల్ రంగు కాగితాలు, ఇంకా ఏవో కొబ్బరి, కలకండ, జీడిపప్పు, బాదంపప్పు యిలా ఎన్నో .... ఒక వైపుగా పండ్లు, ఆపిల్స్ బంగినపల్లి మామిడిపండ్లు, ద్రాక్ష బుట్టలు, బత్తాయి పళ్ళు, టెంకాయలు.

పెళ్ళికూతురు లేచింది, అజంతాశిల్పానికి ప్రాణం వచ్చినట్లు పాదం కదిపింది. ఆమె కాలికి క్రొత్తగా అలంకరింపబడ్డ గజ్జెలమెట్లు చిరుసవ్వడి చేసాయి. మెడలో పూలమాల బరువుగా వుంది. నిరూప, నిరూప భర్త శ్రావణికి, రాజశేఖర్ కాళ్ళకు నమస్కారం పెడుతున్నారు. శ్రావణి కళ్ళల్లో తడి —

నేను శ్రావణి ముఖంవంక చూసాను. ఆ కళ్ళు వర్షించలేదు, నా చూపులు రాజశేఖరంవైపు అప్రయత్నంగా మళ్లాయి. అతనికళ్ళు గర్వంతో మెరుస్తున్నాయనుకున్నాను. కాదు అవీ గాజుగోళాల్లానే వున్నాయి.

ఇలాంటి కొన్ని సాంప్రదాయాలు నన్ను కదిలిస్తాయి.

శ్రావణివైపు మరలా చూసాను. కట్టుకున్న పట్టుచీర పదిహేను వేలన్నా వుంటుంది. ఆ పట్టుచీర.... దానిమీద రవ్వలహారం ఎన్ని లక్షలో నా ఊహకందని విషయం. ఆమె అలంకారంమీదనుండి నా చూపు ఆమె ముఖంమీదకు మళ్ళింది. ధగ, ధగ వెలిగిపోతున్న చీరలో, నగల్లో ఆ

ముఖం మెరిసిపోవడంలేదు కేవలంగా వాడిపోయివుంది. వీడియో ఫ్లాష్‌కాంతి కూడా శ్రావణి ముఖాన్ని తేజోవంతం చేయలేకపోయింది.

అదేమాట తేజాతో నేనంటే తేజా అంది "పిచ్చీ! అముఖం వెల గాలంటే ఆ స్విచ్ అల్లుడి చేతిలో వుంటుందే!"

నేను నిట్టూర్చి శ్రావణి దగ్గరకు నడవబోయాను కానీ వీలవలేదు. నిరూప గడప దాటుతోంది భర్తతో. ఎవరో ముత్తైయిదువ నిరూపకి మోయ లేనంత మూట అందించింది. అందులో వెండివి ఒడికట్టు సామాను, దేవు డికి పాయిసం చేయడానికి సగ్గుబియ్యం, ఆడబడుచుకు పసుపు-కుంకుమ, పట్టుచీర, యిలా ఏవేవో - అదో సాంప్రదాయం. ఆడపిల్ల గడపదాటి ఉద్యోగాలు చేయకూడదనే సాంప్రదాయాన్ని మాత్రం గడపదాటించేసాం కానీ యిలాంటి అనవసరపు సాంప్రదాయాల్ని మాత్రం భద్రంగా రక్షి స్తున్నాం.

ప్రక్కన తేజా నిశ్శబ్దంగా నిట్టూర్చడం చూసాను. ఆ తర్వాత తల తిప్పితే నిరూప, వెనుక నిరూప భర్త మేనత్త....ఆమె నిరూపకోసం పిలుపుకొచ్చినామె. పెద్ద జరీ అంచున్న కంచిపట్టుచీరతో, రవ్వల నగలతో నడిచింది. ఆమె వెనుక శ్రావణి బంధువులు. కళ్ళు చెదిరే అలంకారాలతో, పట్టుచీరల రెపరెపలతో పెద్దపెద్ద వెండి డిష్‌లనిండా సాంప్రదాయపు అక్ష రాలతో .... ముత్తయిదువలు ఒక్కొక్కరే వెళ్తున్నారు – ఇక నేనేమి కల్పుకోగలను శ్రావణిని ?

మేమిద్దరం బిత్తరపోయి చూస్తున్నాము. పెళ్ళికూతురు వెనుకవున్న ముత్తయిదువుల క్యూ తరగడమేలేదు, వీడియోఫ్లాష్‌ల కాంతికి అంతేలేదు. ఇంటి ముంగిట లెక్కపెట్టలేనన్ని కార్లు- ప్రతి కారునిండా ముత్తయిదువలు అన్ని కార్లూ కళకళలాడుతున్నాయి. ధగధగలాడే ముత్తయిదువల్ని మోస్తూ ....

నేను, తేజా వాకిట్లో నిల్చున్నాము. ఆ సారెను మా ఇళ్ళలోలా ముత్తైదువులు మోసుకెళ్ళడం లేదు. ఆ కాంపౌండ్‌లో వున్న ట్రాక్టర్‌లోకి ఎక్కిస్తున్నారు. ఇంకోవైపు వున్న ఖాళీ లారీలోకి ఫర్నిచర్ ఎక్కిస్తున్నారు. డబుల్‌కాట్ మంచాలు, డన్‌లప్ పరుపులు, కాస్ట్లీ సోఫాసెట్, కలర్ టి.వి., డి.వి.డి హోమ్ థియేటర్, ఖరీదైన డ్రస్సింగ్ టేబిల్ ఇంకా ఎన్నో వస్తువులు. లారీ అయినా పడుతుందో.... లేదో.... మరీ ఆడంబరం కాకపోతే! ఎంత డబ్బుంటే మాత్రం బెడ్‌రూమ్‌లో మినీ ఫ్రిజ్ అవసరమా అన్ని పండ్ల బుట్టలు, అన్ని స్వీట్స్‌తో నింపిన బుట్టలు ఎందుకు? అర్భాటం కాకపోతే –

"ఇంత వేస్టేజా?" నా మనసులో మాట తేజా అంది.

నేను మాట్లాడలేదు. ఈ సాంప్రదాయం పేరిట యీ ఆడంబరం వెనుక ఎవరి హస్తం వుందో!

మా యిద్దరి ఆలోచనలు ఆశ్చర్యాల మధ్య శ్రావణి హడావుడిగా వెనక్కి వస్తోంది.

'ఏవిటీ? శ్రావణికి మనిద్దరం అక్కడికి రామని చెప్పాంగా ఎందుకంత కంగారుగా వస్తోంది" నాకస్సలలాంటి హంగామా ఫంక్షన్స్‌లో ఊపిరాడదు. అందుకే ఇంటికి కాపలా మేమిద్దరం వుంటామని చెప్పి శ్రావణిని ఒప్పించాను.

"ఏమిటి? ఏమైంది?" ఇద్దరం ఒకేసారి అడిగాము.

"ఏమీలేదు .... నగల సూట్‌కేస్‌లో, వాళ్ళు నిశ్చితార్థంనాడు నిరూకి పెట్టిన హారం పెట్టడం మర్చిపోయాను"

"ఏం కొంప మునిగిపోయింది. రేపివ్వచ్చుగా" ఆమె వెనకే పరుగు తీస్తూ అన్నాను.

"నీకు తెలీదులే" అంటూ సేఫ్ తెరచి ఆ హారం తీసుకుని, వచ్చినంత వేగంగానూ వెళ్ళిపోతూ ఏమి గుర్తొచ్చిందో, ఒక్కక్షణం వెనక్కి తిరిగింది.

'నీకు తెలీదులే' అన్న ఆ ఆరు అక్షరాల్లో, ఆ కంగారులో నాకు ఆమె ఆవేదన సర్వంలో వినిపించింది.

"మా గురించి ఆలోచించొద్దు నువ్వు హాపీగా వెళ్ళిరా"

"ఏమిటో మీరు వచ్చినా నాకు తోడుగా వుందురు" తనలో తను అనుకున్నట్టుగా అనేసి పరుగుతీసింది. నలభై ఏళ్ళ శ్రావణి పాతికేళ్ళ శరీరంతో, అరవై ఏళ్ళ మనస్సుతో.... నా చేతిలో తాళాలు వుంచి, బీరువా లాక్ చెయ్యమని చెప్పి వెళ్ళింది.

ఐరన్ సేఫ్ దగ్గరకు నడిచాను. తాళంపెట్టి కుడివైపుకి తిప్పాను. నాలో చిత్రమైన ఊహాకల్పన –

నా చేతిలోవున్న తాళాన్ని మరోసారి ఎడమవైపుకి తిప్పి డోర్ తీస్తే ఆ సేఫ్‌నిండా మా శ్రావణి నగలు ఎన్నో– అందులో ఒక్కటి ఒక్కటంటే ఒక్కటి తీసుకుని నా అల్లుడి దోసిట్లో పోస్తే .... అప్పుడు అతను తనని ప్రేమగా 'అత్తయ్యా !' అని పిలుస్తాడు కాబోలు – కానీ.... కానీ ఆ నగిషీ పిలుపుకోసం తనెంత నష్టపోతుంది ? దేన్ని నష్టపోయేది? కొనుక్కోలేని కొండంత స్నేహాన్ని. ఒకవేళ నా పేదరికాన్ని, దాని వెనుక నా బాధల్ని అర్థం చేసుకుని నా స్నేహితురాలు నన్ను క్షమించొచ్చు. కానీ ఈ జీవితంలో నన్ను నేను క్షమించుకోగలనా ?

"ఏమిటీ ఇంతసేపు. రా అలా హాల్లో కూర్చుందాము" ఊహాసరం తెగిపోయింది. భారమైన గుండె తేలికపడింది.

'ఊహే ఇంత బరువుగా వుంటే .. మరి మనుషులు ఒకర్నొకరు ఎలా మోనం చేసుకోగలరో !'

"పద" తాళాలగుత్తి చేతిలోకి తీసుకుని కదిలాను. నా ఊహలాగే ఆ తాళాలగుత్తి కూడా చాలా బరువుగా వుంది.

డబ్బు కొద్దిగా వుంటే అది మనల్ని రక్షిస్తుంది. అది మితిమించితే దాన్ని మనం రక్షించాలి.

'ఏది మేలు ?' నవ్వుకున్నాను.

చేతిలో చిల్లికానీలేని తను వున్నవాళ్ళను విమర్శిస్తోందా ? డబ్బు దెయ్యం తలోరకంగా అందర్నీ సర్కస్ చేయిస్తున్న ఈ లోకంలో ఆ డబ్బు అనే పదం లేకపోతే ఎంత బాగుండేది !

మరలా నవ్వుకున్నాను.

"ఒరే సత్తిగా ! మన చిన్నమ్మ మన అయ్యగారిచేత సాలానే ఖర్చు పెట్టించిందిరా పాపం అమ్మగారికి ముఖంలో నెత్తురు సుక్కే లేదు."

"ఆఁ అవును పాపం....అయితే ఏరా? రేపు ఇంతకంతా మన బాబు పెళ్ళిలో రాబట్టమా ?"

సత్యమూర్తో, సత్యనారాయణో, సత్తిగా అని పిలవబడ్డ ఆ మనిషి ఆ ఇంటి నౌఖరు. అతను ఏమంటున్నాడు ?

'అవును పాపం' .... అని తన యజమాని కష్టానికి, ఖర్చుకి బాధపడ్డ అతనేమంటున్నాడు ?'

ఆ ఇంటి మగబిడ్డ పెళ్ళిలో ఇప్పుడు నష్టపోయిందంతా రాబట్టా లంటున్నాడు. తన యజమానురాలు ఈ రోజు కార్చిన కన్నీటిని – రేపు ఈ ఇంటికి, రాబోయే కోడలి తల్లి కళ్ళల్లో చూడాలంటున్నాడు.

'ఎంత ఘోరం ఈ సాంప్రదాయాలెంత హేయం!!'

"ఏయ్ దివ్యా!" తేజా ఆనంద శబ్ద తరంగాలకు ఉలిక్కిపడ్డాను.

వాకిట్లో దివ్య. ఈరోజు రాదనుకున్న దివ్య....వస్తేబాగుణ్ణనుకున్న నేస్తం....దివ్య.

మెల్లిగా నడిచివచ్చి మా ప్రక్కనే సోఫాలో కూర్చుంది.

"కవిత రానిచ్చిందా ?" అసంకల్పితంగా అడిగాను.

"మా అక్క వచ్చింది. ఆమె నక్కడపెట్టి ఎంత హడావుడిగా వచ్చినా నిరూప వెళ్ళనే వెళ్ళిపోయింది. అవునూ....మీ రెళ్ళలేదేం ?"

"అక్కడ వూపిరాడదనీ" నవ్వింది తేజ.

శ్రావణి ఇంటి ఆడంబరం తెలిసిన దివ్య మరలా రెట్టించలేదు.

"కవిత అత్తగారు...." మాట మాధ్యలోనే ఆపేసాను. దాన్ని ఎలా పూర్తి చేయాలో తెలియక.

"వాళ్ళు అలిగి వెళ్ళిపోయారు...." నాకు స్వతంత్రం ప్రకటించి నవ్వింది దివ్య.

అది నవ్వులా లేదు. శ్మశానరోదన ధ్వనిలా వుంది.

"కీస్‌లేవా ?" కాస్త నడుమువాల్చి మాట్లాడుకుందాం. అలసటగా వుంది ఎందుకో...." దివ్య నావైపు చూసింది.

ఎందుకో ? అన్న పదానికి జవాబు దివ్యకూ తెలుసు, నాకూ తెలుసు. అది ఆమె నాలుగుపదుల వయస్సు పెంచుకున్న శరీరానికొచ్చిన అలసటకాదు. ఆమె వియ్యంకుల నిష్ఠుర నిందా వాక్య శరాల గాయాల తాలూకు మానసిక అలుపు అది.

"ఉన్నాయి దా వెళ్దాము."

* * *

దీపావళికి అల్లుడు వచ్చాడన్నావు కదా! నువ్వేమిటీ ఇంత త్వరిగ్గా ఇక్కడ...." దివ్య ఆశ్చర్యపోతూ మంచంమీద కూర్చుంది.

"రావడం, అలిగి వెళ్ళిపోవడం కూడా అయిపోయింది" దిండుతీసి ప్రక్కనపెడ్తూ దివ్య ప్రక్కనే కూర్చున్నాను.

"నా కూతురి పురుడు రావడం, దాని అత్తగారు వెళ్ళటంలాగానా ?" అని నవ్వింది దివ్య. నేను ప్రక్కన తీసిపెట్టిన దిండు తీసుకుని దానిమీదకు వాలి పడుకుంటూ.

మా అసహాయ జోక్స్‌ని తేజా అర్థం చేసుకున్నట్లుంది. మమ్మల్ని వివరాలడిగి ఇబ్బంది పెట్టలేదు.

"నేను పెళ్ళికి రాలేకపోయాను, బాగ జరిగిందట కదా !"

మా సమావేశానికి మా రాబోయే సంభాషణలకు తేజ తొలిపాదం మోపిందన్నమాట.

"అవునూ ఎందుకు రాలేదూ ! నీ కోసం మేమంతా చాలాసేపు ఎదురుచూసాం."

క్షణం మాట్లాడలేదు తేజ. ఆ తర్వాత ఆమె అబద్ధం చెప్పదల్చుకున్నట్టులేదు. నిజం ఒప్పేసుకుంది కుర్చీలో నుండి లేచి నా ప్రక్కనవచ్చి కూర్చుంటూ చెప్పింది.

"పెద్ద కారణం ఏమీలేదు. నా కాబోయే అల్లుడు నా కూతురికోసం వచ్చాడు. ఇద్దరినీ ఒంటరిగా వదిలి రాలేక."

మూడు రోజుల నుండి శ్రావణి కన్నీళ్ళన్నూ, దివ్య భయాల్ని; నా అశక్తతను అవిరామంగా మోసిమోసి శోష వచ్చినట్లయిన నా మనసుకి కాస విశ్రాంతి కావాలన్పించింది. సీత శోకాన్ని మోసిన అశోక చెట్టు

క్రింద నుండి కాశ్మీరం మంచులోకి కదిలిపోవాలనుకున్నాను. ఆ దురాశలో ఓ జోక్ విసిరి ఆ కాశ్మీర్ లోయల్లోకే దొర్లిపోయాను.

"అమ్మో! ఆ వాచ్ మెన్ పని చెయ్యకపోతే, నా కూతురికి కడుపు తెచ్చి మోజు తీరాక ఆ కడుపు ఎవరితో వచ్చిందోనని నా కూతుర్ని వదిలించుకోగల సమర్థుడు నా అల్లుడు" అంది తేజ.

"నువ్వెందుకే వాళ్ళమధ్య పి. పి. లాగ" అన్న నా జోక్‌కి జవాబుగా.

ఇక జోక్‌లు వేయడానికే కాదు, మామూలు కుశల ప్రశ్నలు వేయడానికి కూడా మాకు మాటలు దొరకలేదు.

మా ఖర్మలెలాగూ ఇలా కాలాయి కాకపోతే....నిజం ఒప్పుకోవాలి. ఇంతవరకు మా కూతుళ్ళను మాత్రం పువ్వుల్లానే చూసుకుంటున్నారు మా అల్లుళ్ళు. మమ్మల్ని కాల్లో ముళ్ళులా తీసిపారేసినా....మరి....మరి తేజా కాబోయే అల్లుడు అంత కుసంస్కారా ?

మేము కనీ వినీ ఎరగనట్టుగా నిశ్చితార్థం చేసింది తేజా. కాబోయే అల్లుణ్ణి, కూతుర్ని పీటలమీద కూర్చోబెట్టి ఆ ఒక్క మంగళసూత్రం తప్ప అన్నీ జరిపింది మరిలా మాట్లాడుతుందేవిటీ తేజ ?

"నిశ్చితార్థాలు చేయకూడదే....నేరుగా పెళ్ళి చేసేయడం మంచిది. నాలాటి దౌర్భాగ్యపు తల్లులకు ఈ వాచ్ మెన్ పనిచేసే దుస్థితి తప్పిపోతుంది." చిన్న నిశ్వాస వదిలి అంది తేజ.

"ఛ. అలా అనకు. నేరుగా పెళ్ళి అవగానే పాపం ఒకరి మనసు ఒకరికి తెలీకుండా పశువుల్ని బందిలదొడ్లో వేసినట్టు వాళ్ళను తోలడం ... మీ పద్ధతులు నాకు నచ్చవు" దివ్య మొగమాటం లేకుండా అనేసింది. వాళ్ళల్లో సదహారో రోజుగాన్నీ కొత్త జంట కొత్త తీర్చరు.

నిటారుగా కూర్చుంది తేజ.

"ఏవిటి దివ్యా నువ్వనేది ? ఆ పచ్చతాడే, ఆ ప్రాణిగ్రహణమే వాళ్ళను దగ్గర చేస్తుంది కొత్తేవిటీ నా తలకాయ"

పడుకోనున్న దివ్య లేచి కూర్చుంది.

"మీరెన్నయినా చెప్పండి మనది పవిత్రమైన భారతదేశమే కావొచ్చు. కానీ నాకు పరాయి దేశాల డేటింగ్ పద్ధతి తర్వాత పెళ్ళే ఇష్టం. ఎంచక్కా ఎవరికి వాళ్ళే తనకు నచ్చిన జీవిత భాగస్వామిని సెలక్ట్ చేసుకుంటారు. ఈ కట్నాలు కానుకలు గాడిద గుడ్డు లేకుండా...."

విస్తుపోయినట్టు చూసింది తేజ. ఆ తర్వాత కోపంగా అంది "మనం పుట్టింది అమెరికాలో కాదు ఇండియాలో అది గుర్తుపెట్టుకోవాలి మనం."

"ఏం ఇండియా అయితే నిశ్చితార్థం అయ్యాక ఒకరి పద్ధతులు ఒకరికి నచ్చకపోతే ఫారిన్‌లోలాగ బై బై చెప్పుకుంటే తలతీసి మొలేస్తుందా ?" ప్రక్కనే వున్న ఆంధ్రజ్యోతి పుస్తకం చేతిలోకి తీసుకుంటూ సీరియస్‌గానే అంది పాపం కట్న కానుకల బేరాలలో బేజారెత్తిపోయున్న దివ్య. నాకు తెలుసు ఈ ఆవేశం తాత్కాలికం.

ఆంధ్రజ్యోతిలో పుటలు తిరగవేయబోతున్న దివ్య చేతిలో పుస్తకాన్ని లాక్కొని ప్రక్కనపెట్టి దివ్యవైపు చిరాగ్గా చూసింది తేజ.

"నా తలతీసి ఎవరైనా ఇండియా గేట్లో మొలేస్తారని నేను భయపడితే ఆ మొలేసేది నా కూతురే..... ఇంకే భారతీయులుకాదు."

"ఏమైంది తేజా?" తేజా కళ్ళల్లో ఉబికివస్తున్న కన్నీటిని గమనించిన నేను ఆమె చేతిని నా చేతిలోకి తీసుకున్నాను.

మేఘం వర్షించింది.

"దివ్య అలా అలా అంటుంది కానీ బిందూ! ఇప్పుడు చూడు నిశ్చితార్థం అయి సంవత్సరమయింది. వాళ్ళా పెళ్ళిమాట ఎత్తరు. పెద్ద కొడుక్కి పెళ్ళి కుదిరితే ఇద్దరికీ కలిపి చేయాలంటున్నారు. వీళ్ళేమో సిని మాలకు, షికార్లకు తిరగొద్దంటే వినకపోతిరి ...." ఏడుస్తూనే అంది తేజ.

దివ్య పశ్చాత్తాప పడింది. లేచి తేజా దగ్గరకొచ్చి ఆమె కన్నీళ్ళు తుడిచింది.

"సారీ తేజా! నువ్వు బాధపడ్తావనుకోలేదు."

"దీంట్లో బాధ పడేమాట నువ్వేమన్నావులే" నేను దివ్యకు ఓ ఓదార్పుమాట చెప్పి తేజ వైపుకు మళ్ళాను.

"అయినా తేజా! ఈ రోజుల్లో కూడా నువ్వు మన రోజుల్లోలా వుండమంటే ఎలా? పైగా పెళ్ళిలా నిశ్చితార్థం చేస్తిరి. ఆ పిల్లాడికి మన శివమాలమీద అధికారం వచ్చే .... అందుకని తిరుగుతుంటారేమో! అంత మాత్రాన అతను మనల్ని మోసం చేస్తాడా? నీ పిచ్చిగానీ!"

"ఆ .... ఇంకా ఏదీ జరక్కముందే ఆ మోసం ఏదో చేస్తే నా నెత్తిన పన్నీరు చల్లినట్టే...."

మా మధ్య శబ్దం నిశ్శబ్దమయి పోయింది.

ఆ అవాంఛనీయ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ తేజ తనే మొదట పెదవి కదిపింది –

"దివ్య అంది చూడూ 'విదేశాల్లోని డేటింగ్ పద్ధతి మంచిద'ని - మంచిదే, కాదనను ఒకరి మనస్సు ఒకరు తెల్సుకోకుండా ఒకరి అభిరుచులు ఒకరికి తెలీకుండా కేవలం తరతరాల వంశగౌరవాలు బేరీజువేసి, కట్న కానుకల బరువు చూసి మురిపెంగా పెంచుకున్న పిల్లల్ని. కళ్ళు మూసుకుని

జామాత ఒడిలో పారేస్తున్నాం, వాడెలాటివాడైనా... అదీ మన పవిత్ర భారత భూమి చేస్తున్నది - దివ్య చెప్పింది నిజమే, కానీ వెధవది మన రక్తంలో మనదేశ సంస్కృతి చిక్కగా ప్రవహిస్తోందే! మరి దాని మాటేవిటి ?"

మేము బిక్కచచ్చిపోయి వింటున్నాము. ఏమి వినాల్సి వస్తుందోనని ఊపిరి బిగబట్టి మరీ వింటున్నాము ... మా దౌర్భాగ్యం మా స్నేహితురాలికి కూడా ఎదురుపడకూడదని మనసారా వాంఛిస్తూ వింటున్నాం.

"దివ్యా ! ఇప్పుడు చెప్పు. నా అల్లుడు సకల దుర్గుణాభిరాముడని తెల్సినా, నా కూతురు వాడేకావాలని పట్టుబడ్తోందే. నేనూ,వాళ్ళనాన్నగారూ సాహసించి ఈ పెళ్ళి కేన్సిల్ చేసుకుందామంటుంటే, ఈ తరం ఆడపిల్ల శివాని పత్ని కాకముందే పాతివ్రత్యంగురించి కధలు చెప్తోందే.... ఇప్పుడు నన్నేం చేయమంటావు? నిశ్చతార్థం అనే ఈ డేటింగ్ మంచిదేనంటావా ?"

ఆయాసంతో ఆగింది తేజ.

నేను ఆలోచిస్తున్నాను.

మాట తీసుకుంటే మగపెళ్ళివాళ్లు, ఆడపిల్ల కన్నవాళ్ళని మోసం చేయరని పెద్దవాళ్లు ఎంతో ఆలోచించి నిశ్చితార్థం అనే సాంప్రదాయం పెడితే దాని వెనుక అంతరార్థాన్ని అర్థం చేసుకోకుండా దానికి నగిషీలు చెక్కి, పెళ్ళికొడుకుని ఫీల్డ్‌లోకి తెచ్చి పూలమాలలు మార్చి, గొప్పగా నిశ్చితార్థం చేసామని భుజాలు ఎగరేసుకుంటున్నారు తేజాలాటి వాళ్లు.... తప్పు తేజాది, శివాదికాదు. అతనిమీద ప్రేమ పెంచుకున్న ఆ పిల్ల ఆ పిల్లాడిని మర్చిపోలేకపోవడం తప్పెలా అవుతుంది ? – తప్పు ఎంచాల్సి వస్తే ఆ తప్పు ఆ పిల్లవయస్సుది, ఆ పిల్ల రక్తంలో ప్రవహించే

హిందూ రక్తంది. ఆ ప్రాచీన మనసుకీ, ఈ పాశ్చాత్య పద్ధతులకు పొత్తు కుదరక పడే మానసిక ఆవేదన తాలూకు లావా ఇది .... ఇది సంధి యుగం. అది గుర్తించకుండా పరిగెట్టి బోల్తాపడుతున్నాం మనం.

"ఆ అబ్బాయి తాగుతాడా ?" భయంగా అడిగింది దివ్య.

"ఒక్క తాగుడేవిటీ ? అన్నీ... " తన కన్నీళ్ళు తానే తుడుచు కుంటూ దయనీయంగా అంది తేజ.

మాలో దిగ్భ్రాంతి, దిగులు.

"తేజా ! మీరు సాహసం చేస్తారా ? నేను శివాని ఒప్పిస్తాను" నా స్నేహితురాలి కన్నీళ్ళతో కదిలిపోయిన నేను మనస్ఫూర్తిగా అన్నాను.

"నా చిన్నారి తల్లి జీవితం బాగుండాలేకానీ... ఎవర్ని ఎదిరించ మన్నా ఎదిరిస్తాను" మంకెన పూవులాటి ఆమె కళ్ళల్లో అప్పటికప్పుడే ఊరిన కన్నీరు అప్పుడే చిందిన రక్తంలా ....తెల్లటి ఆమె బుగ్గల మీదకి ఉరకడానికి సిద్ధంగా వుంది. ఆ రక్తధారను మాకు చూపడానికిష్టం లేని దానిలా కళ్ళు వాల్చుకుంది తేజ. ఆమెను ఓదారుస్తున్న దివ్య నల్లటి చేతిమీద చుక్కల్లా రాలిన ఆ కన్నీరు స్వచ్ఛంగా తెల్లగా మెరుస్తూ మా నేత్రాల్ని తడిచేసింది.

"ప్లీజ్ బిందూ ! నాకీ హెల్ప్ చేసిపెట్టు నీకు ... నీకు ... ఐ విల్ బి థాంక్‌ఫుల్ టు యు లైఫ్‌లాంగ్" మాకళ్ళేకాదు మాశరీరాలు కూడా కంపించాయి -

"తప్పకుండా... తప్పకుండా నేను, దివ్య శ్రావణి అందరం రేపే వస్తాం.... ఆ పిల్లకేం తెలుసు, పసిది సుఖపడే జీవితం ముందు ఎంతో వుందని వాళ్ళకేం తెలుస్తుంది ? మనం చెప్పాలిగానీ ... "

"చెప్పకుండానే వున్నానా బిందూ! దౌర్భాగ్యురాలు వింటేనా ?

ప్రేమే దైవం అట, ప్రేమే సర్వం అట, ప్రేమ కోసం తన జీవితం త్యాగం చేస్తుందట ...." తల్లి బిడ్డ గురించి చెప్పే నేరంలో ఆనందం వుండదు వేదన వుంటుంది... పాపం... తేజా.

"టీనేజ్ ప్రేమమీద వచ్చే సినిమాలు ఎక్కువయి పోయాయి. కథలూ అంతే. వాటిని చూస్తే చదివే ఈ టీనేజ్ పిల్లల్లో వచ్చిన మైకం ఇది - ఏం ? - ముక్కు ముఖం తెలీనివాడి ప్రేమముందు సాగరింలాటి తల్లి ప్రేమ చిన్నదా ? ఎందుకు గ్రహించరు వీళ్లు!

అదే అన్నాను.

"ఎందుకు గ్రహించరూ ? గ్రహిస్తారు ఎప్పుడు ? - అన్నీ అయి పోయాక.... అప్పుడు అమ్మా ! అన్నా 'అయ్యో !' అన్న ఏం లాభం?" దిగులుగా అంది తేజా.

నిజమే ప్రక్కవాళ్ళ జీవితాల్లోనుండి మనం పాఠాలు నేర్చుకుని అడుగు ముందుకు వేయాలిగానీ మన జీవితాలనుండే నేర్చుకోవాలను కుంటే.... ఏం ప్రయోజనం ? జీవితాలు పూర్తిగా కొల్లగొట్టబడ్డాక.... నిట్టూర్చాను.

"దిగులుపడకు" మరొక్కసారి మేమిద్దరం తేజాకి ధైర్యం చెప్పాము మా దిగులు మర్చిపోయి క్షణకాలం. ఆ తర్వాత ఎవరి ఆందో శనా ప్రపంచంలోకి వాళ్ళం వెళ్ళిపోయాం.

నిశ్శబ్దం రాజ్యమేలుతున్న క్షణాల్లో ఆ రూమ్‌లోకి అడుగుపెట్టింది శ్రావణి.

"అరె: మీరిక్కడున్నారా? ఇల్లంతా వెతికి వస్తున్నాను!"

వార్డురోబ్ తెరిచి నైటీ తీసుకోబోతున్న శ్రావణికి మా నిశ్శబ్దంలో ఏ శబ్దార్థం గోచరించిందో తను తీసుకున్న హాంగర్ అక్కడే వదిలేసి మా దగ్గర కొచ్చింది.

"ఏమిటి అలా వున్నారు ?" భయంగా చూస్తూ అంది.

పాపం ఘనమైనపెళ్ళి తాలూకు 'భయం' మైకం ఇంకా వదిలినట్టు లేదు.

"ఏమీలేదు" మేం ముగ్గురం చిరునవ్వు ఎరువు తెచ్చుకున్నాం, పెదాల్ని బలవంతంగా సాగతీసుకున్నాం.

"భోంచేసారు కదా !"

"లేదు. చేస్తాం"

"ఇంకా భోంచెయ్యలేదా ? ఇప్పుడు టైమ్ ఎంతయిందనీ ! .... పదకొండు ..."

"పర్వాలేదు కబుర్లు చెప్పుకుంటున్నాం" నవ్వొచ్చింది నాకు. చాలా నెలల తర్వాత కలుసుకున్న ప్రాణస్నేహితులం. మేము చెప్పుకున్నవి కబుర్లా ? పంచుకున్నవి ముచ్చట్లా ?

"వంటామె అయినా మిమ్మల్ని పిలవలేదా ? వీళ్ళకి బుద్ధిలేదు. అసలు నాకుంటేనా ? మీకు మీల్స్ సర్వ్ చేయమని చెప్పి పోనక్కర లేదూ ?" పాపం నొచ్చుకుంది శ్రావణి. ఎంత స్నేహితులమైనా వస్తులుం చడం దగ్గరితనం కాదు, పైగా అది మనం జీర్ణించుకున్న సంస్కృతీ కాదు.

"భలేదానివే నీ హడావుడిలో నువ్వుంటే, భోంచేయమని నువ్వు చెప్పాలా ? బొట్టుపెట్టి - మాకే గుర్తురాలేదు. దివ్యకూడా వచ్చిందా.... ఏవో కబుర్లు."

'ఆ కబుర్లు....బాల్యం అంతతియ్యగా వుండుంటే ఎంత బావుండేది! నిట్టూర్చాను. 'ఎంత అత్యాశ ఆ అందమైన బాల్యం మరలా తిరిగొస్తుందా?'

"అవునూ .... అన్నట్టు దివ్య ఎప్పుడొచ్చిందీ ?"

"మీరు అటు వెళ్ళగానే"

"అక్కడ స్టోర్‌లో స్వీట్స్ వున్నాయి. అవన్నా తీసుకోక పోయ్యారా ?" మరలా నొచ్చుకుంది శ్రావణి. అది ఫార్మాలిటీకాదు నిజం గానే బాధపడుతోంది.

"నేను భోంచేసే వచ్చాను మీరు కానివ్వండి" పడుకోబోతూ అంది దివ్య.

"పెళ్ళింటికొస్తూ భోంచేసి వస్తావా ? నీకేం శిక్ష వేయాలి ?" శ్రావణి జోక్ వేసింది.

"స్వీట్స్ పది ఇలా పారేయ్ రేపటికి, నాకు డయాబెటీస్ అటాక్ అవ్వడం ఖాయం .... చాలా ఆ శిక్ష ?" దివ్య ఎదురు జోక్ విసిరింది.

ఇప్పుడు .... ఇప్పుడు నాకిది పెళ్ళిళ్ళనిపించింది. ఆ సరదాలు, ఆ ఛలోక్తులు, ఆ నవ్వులు, ఆ తృళ్ళింతలు, ఆ కేరింతలూ పచ్చటి పందిట్లో ఇవీ కావాలి – రంగురంగుల షామియానాల క్రింద ఆర్టిఫిషియల్ నవ్వులు, ఆరిపోని ఆందోళనలు కాదు.

"ఓ.కె బ్రాహ్మణీ ! నీకు ఫ్రూట్స్, స్వీట్స్ పెడతాను. రండి మీరు కూడా అందరం కల్సి భోంచేద్దాం" మమ్మల్ని ఉక్కిరిబిక్కిరి చేసింది శ్రావణి క్షణంలో.

"అదేవిటి నువ్వుం భోంచేయలేదా ?"

"చేసాను అక్కడ తినింది అన్నం; ఇక్కడ తినబోయేది అభి మానం ... నాకా అన్నం సహించలేదు. మీతో రెండుముద్దలు తింటాను .. పెట్టరా ఏం ?"

"నీకు పెట్టే రెండు ముద్దలేం - చాలా మిగిలుంది డైనింగ్‌టేబిల్ మీద రా" అందరం లేచాం.

ఈ ఆనంద కోలాహలంమధ్య నాలో ఏదో నాకు తెలీని అసంతృప్తి.

శ్రావణికి కావాల్సింది ఆ రెండు ముద్దల మల్లెపూవులాంటి అన్నం కాదు. రెండు ఓదార్పు మాటలు కావాలి .... అవే దొరకక అల్లాడుతోంది నా మనసు రేపుగురించి ఆలోచించి.

* * *

గెస్ట్‌రూమ్‌లో కూర్చుని నేనాలోచిస్తున్నాను. అసలే రాత్రికి శ్రావణితో వుందామనే వచ్చాను. కానీ ఇంటికి పోవాలనిపిస్తోంది. ఇంత అందమైన ఇంటినుండి రెండు గదుల నా చిన్న ఇంటికి వెళ్ళిపోవాలనిపిస్తోంది. నా ప్రజెన్స్‌కోసం ఆరాటపడే శ్రావణిని, చిన్ననాటినేస్తం దివ్యను, స్నేహితురాలు తేజాను వదిలి - నా మనసు తెలుసుకోకుండా, నా కష్టం గమనించుకోకుండా కోరికలు కోరి, నిష్ఠూరమాడే నా కూతురి దగ్గరకు, అంతస్థు తెలుసుకోకుండా టి.వి కొనమని వేధించే కొడుకు దగ్గరకు వెళ్ళాలని ఆరాటపడుతోంది. ఏవిటీ పాశం !

"ఈయనకు బెడ్‌షీట్ స్ప్రెడ్‌చేసి వస్తాను ఒన్‌మినిట్" అని వెళ్ళబోతున్న శ్రావణిని దివ్య ఆపింది.

"ఈయన్ని పన్నెండు గంటలకు రమ్మన్నాను నన్ను తీసుకెళ్ళడానికి."

నేను రిలీఫ్ ఫీల్ అయ్యాను. నాకు ఇప్పుడు శ్రావణి చెప్పేది వినే శక్తి లేదు. కానీ పాపం శ్రావణికి తన గుండెభారం తగ్గించుకోవాలని వున్నట్లుంది. ఇప్పుడు అలాంటి శ్రావణిని వదిలేసి వెళ్ళే కారణం నేను కాకపోవడం .... గిల్టీ ఫీలింగ్ లేకుండా ఎంతో హాయిగా వుంది. దివ్య వెళ్ళిపోతే తనూ వెళ్ళిపోవచ్చు.

"వెళ్ళిపోతారా ?" నిస్సహాయంగా చూస్తున్న శ్రావణిని చూసాక, నా స్వార్థానికి నన్ను నేను శపించుకున్నాను.

"ఏం తేజా మీవారు కూడా వస్తారా ?"

"నీకా దిగులక్కరలేదు. మా ఆయనకు ఈ టైమ్‌లో మందు తప్ప స్వంత మనిషి గుర్తురాదు. నేను, బిందు వుంటాంలే నువ్వు వెళ్ళి పడుకో చాలా అలిసిపోయినట్టున్నావు."

"ఈ అలుపే బాగుంటుంది. రేపు మీరూ వదినా కూడా వెళ్ళిపోతే ఆ శూన్యంలో నిరూ గుర్తుకొచ్చే క్షణాల్ని ఊహిస్తే భయమేస్తోంది."

నిజంగా నాకు చాలా ఆశ్చర్యంగా వుంది. సాయంత్రం అంత పెద్ద బంగళా పట్టనంత జనం - ఈ క్షణంలో మేము ముగ్గురంకాక శ్రావణి ఆడబిడ్డ అంతే .... పెళ్ళి చూడ్డానికి, రిసెప్షన్‌కి అటెండ్ అవడానికి వచ్చిన ఇంతమందిలో కొన్ని మనసులకయినా అన్పించలేదా ? ఇరవై ఏళ్ల పెంచుకున్న కూతుర్ని పరాయిదాన్నిచేసి వచ్చిన తల్లికి కొంత ఓదార్పు అవసరమని. ఆ ఓదార్పు తామివ్వాలనీ ... నవ్వొచ్చింది క్షణక్రితం తను చేసింది మాత్రం ఏమిటీ ? శ్రావణిని వదిలి వెళ్లాలనుకోలేదూ ?

"దివ్యా ! నీకోసం మీవారొచ్చారు" శ్రావణి ఆడబిడ్డ దేవసేన లోపలికొచ్చి చెప్పింది.

దివ్యతోపాటు అతన్ని పలకరించడానికి ముగ్గురం బయలుదేరాం—

"నమస్కారం" కోరస్ పాడాం దివ్య తప్ప.

అతను చేతులు జోడించాడు చాలు. స్నేహితుల భాగస్వాములంత మాత్రం సభ్యత పాటిస్తే చాలు – కానీ మా అపురూపమైన స్నేహంలో అపశృతి తేజా భర్త. ఆయనకు మా స్నేహమే ఎబ్బెట్టుగా, అసహజంగా, అన్పిస్తుంది. ఎక్కడ మేము కన్పించినా ఓ వ్యంగ్యబాణం వదిలి మరీ వెళ్తాడు.

"మీకేమీ యిబ్బంది లేకపోతే దివ్యను ఈ రాత్రికి నేనుంచుకుని రేపు లంచ్ అయ్యాక పంపిస్తాను."

తను అడగమనలేదన్నట్టుగా దివ్య భావప్రకటన చేసింది. భర్త కోప్పడతాడేమోనని కాబోలు –

భార్య తనతోనే వుండాలనే స్వార్థం – అది అందమైన స్వార్థం. దానికి మనం తప్పు పట్టాల్సిన పనిలేదు.

"భలేవారే నాకేం ఇబ్బంది ? ఒక్కరోజుకి అలాగే వుంచుకోండి"

శ్రావణి కళ్ళల్లో మెరుపు చూసాను ఈ రోజు తొలిసారిగా.

'పెళ్ళి రంగరంగ వైభవంగా చేసావు' అనే పొగడ్త ఇవ్వనికాంతి ఆ చిన్నమాట ఇచ్చిందంటే....శ్రావణి తనకూ దివ్యకూ ఏమి చెప్పాలనుకుంటోందో ! ఎంత బరువు దించుకోవాలనుకుంటోందో !

"వస్తానండీ! రేపు వచ్చి తీసుకెళ్తా దివ్యా !" అనేసి అతను వెళ్ళిపోయాడు. అతను నిరాశపడుంటాడు కానీ ఆ నిరాశను తను మిగిల్చుకుని భార్యకు ఆనందాన్నిచ్చాడు.

ఆ వ్యక్తివంక మెచ్చుకోలుగా చూస్తోంది తేజ.

* * *

"నిద్రొస్తోందా?" అందరికి అన్నీ అమర్చి అర్థరాత్రివేళ మా దగ్గర కొచ్చి శ్రావణి వేసిన ప్రశ్న అది.

"నీకూ"

"నాకు రావడంలేదు రాదు కూడా, పాపం మిమ్మల్నే శ్రమ పెడ్తున్నాను" ఎప్పటికప్పుడు ఎదుటివాళ్ళు తనవల్ల బాధపడ్తారేమోనని బాధపడే మనుష్యులకు అందే వరాలు రెండు. ఒకటి మంచిపేరు, రెండోది మంచితనాన్ని అవకాశంక్రింద వాడుకునే వాళ్ళవల్ల అశాంతి.

నాకు తెలుసు. శ్రావణి కనురెప్పల వెనుక వుండేది నిద్దుర తెర

కాదు. ఘనమైన పెళ్ళి తాలూకు అశాంతి. దాన్ని మా ముందు దించు కోందే తనకు విశ్రాంతిలేదు.

"అయితే దా కూర్చో"

శ్రావణి నిముషమన్నా ఆలస్యం చేయకుండా వచ్చి కూర్చుంది.

"రిసెప్షన్ బాగా జరిగిందా ?"

నాకు నవ్వొచ్చింది. అడగాలని అడగడం తప్పిస్తే రిసెప్షన్ సవ్యంగా జరిగుంటే శ్రావణి ముఖం అలా ఎందుకుంటుంది? అందులో తేజోరేఖలు వికసించవూ ?

"రిసెప్షనా ? దానికేం బాగా జరిగింది"

నిర్లిప్తంగా అంటున్న శ్రావణి వంక క్షణం చూసి తనకీ మాకు మధ్యవున్న బిడియపు తెరను లాగేసాను నేను.

"ఇప్పుడు చెప్పు శ్రావణీ ! ఏమైంది ? .... మాకు సరే డబ్బు ఇబ్బందులు. ఇస్తానన్నవి ఇవ్వలేకపోవడం దాంతో వాళ్ళకి కోపం, కలతలు ఎక్సెట్రా ఎక్సెట్రా."

"మాకూ ఇంచుమించు అలాటివే" నిట్టూర్చింది శ్రావణి.

"ఇలా నీళ్ళలా డబ్బు ఖర్చు చేసిన మీకు కూడా...."

"చెప్పాగా. ఇంచుమించు అలాటిదే. అల్లుడికి మారుతి అడిగారు. మేము ఓ. కె. అన్నాము. తీరా ఈ రోజు మేము అడిగింది థౌంజండ్ సి. సి. అంటారు. ఆ చెప్పేది అప్పుడే చెప్పంటే మా కష్టాలేవో మేము పడుండేవాళ్ళం కదా !"

"థౌజండ్ సి. సి. అంటే పెద్ద మారుతీనా మీకుందికదా ! పోనీ అదిచ్చేయకపోయారా ?" ఉచిత సలహా ఇచ్చాను.

"అమ్మో ! ఇంకేమైనా వుందా పాత కారిస్తే. అప్పటికీ ఈయన ఏదైనా ప్రీమియంపెట్టి రెండు రోజుల్లో పైరిచేస్తానన్నారు."

"ఇంకేమయితే...." నాలుగు లక్షలుచేసే కారుని రెండు రోజుల్లో కొనిస్తానన్న నా స్నేహితురాల్ని చూసి నిజానికి నేను ఈర్ష్యపడాలి. ఎందుకంటే మా అల్లుడు పాపం సంవత్సరం రోజులనుండి ఓ డొక్కు స్కూటరయినా కొనివ్వమని అలిగి కూర్చున్నా ఆ కోరికసైతం తీర్చలేని స్థితిలో వున్నాను నేను. కానీ ఇప్పుడు ఆమెమీద నేను ఈర్ష్యపడే స్థితిలో లేదు. శ్రావణి జాలిపడే స్థితిలో వుంది. కారణం వాళ్ళకి కావాల్సింది కారు కాదట. తాము మగపెళ్ళివాళ్ళమన్న ఆధిక్యతను వీళ్ళు గౌరవించలేదంట. అవమానించారట.

"ఇంకా ?" విస్తుపోతూనే అడిగాను.

"ఇంకా ఏముంధి అలగా వాళ్ళ కిచ్చినట్టు డన్‌లప్ బెడ్స్ కాట్స్ సెట్, డ్రస్సింగ్ టేబిల్, ఇండియన్ క్లాత్‌తో కుట్టిన సోఫాసెట్.... మినీ ఫ్రిజ్, గాడ్రెజ్ బీరువా, ఇచ్చామట"

"మరింకేమైనా సృష్టించి ఇవ్వాలటనా ?" దివ్య వ్యంగ్యంగా అంది.

తేజా మాత్రం మాట్లాడలేదు. బహుశా ఆమెను మేము భయ పెడ్తున్నామేమో. రేపు తనూ ఇలాటివే ఇవ్వాలికదా !

"ఫారిన్ క్లాత్ వేసిన సోఫా కొనలేదట. ఆ సోఫాకి మధ్యలో రౌండ్ టీపాయ్ ఇచ్చామట."

"ఓ స్క్వేయర్ టీపాయ్ కావాలటనా ?" తేజా నోరు తెరిచింది.

"కాదు. అదే క్లాత్ కుట్టి పైన గ్లాస్ లోపల పేపర్స్ వేసుకోను మినీ కబోర్డు వుండాలట."

"ఇంకా ?"

"పెద్ద టి. వి. స్క్రీన్ ఇవ్వలేదట."

"పోనీ సినిమాహాలు ఒకటి వాళ్ళ కాంపౌండ్‌లో కట్టివ్వలేక పోయారా ?"

"అలా కట్టిచ్చే స్తోమతు ఈయనకు ఒకవేళ వుండి కట్టించినా దానికి ఓ విమర్శ వుంటుంది. 'అడిగితేనా ? మీరు చేసేది' అని."

"ఓహో ప్రైమ్‌మినిష్టర్ లెవల్లో వుండే వ్యవహారం" విసురుగా అంది దివ్య.

"పాపం వాళ్ళతో ఎందుకులే పోలుస్తావు ?" నిట్టూర్పు విడిచింది శ్రావణి.

"అవునూ అమ్మకూడా అడగండే అన్నం పెట్టదంటారే. దేవుడిని కూడా వరాలడగండే ఇవ్వడంటారుకదా! వీళ్ళు అంతకంటే గొప్పవాళ్ళా?"

"మగపెళ్ళివాళ్ళుకదా ! ఫ్రిజ్ చిన్నది తీసిచ్చామంట"

"అంత డబ్బుంది యింకా ఫ్రిజ్ కొనుక్కోకపోవడమేవిటీ !"

"వాళ్ళకెందుకు లేదూ ! రూమ్‌లో పెట్టుకోవాలన్నారు. రూమ్‌లోకే కదా అని చిన్నది కొన్నాము. డబుల్‌డోర్ బి. పి. ఎల్. ఫ్రిజ్ కొనివ్వ లేదట...." ముఖానికి పట్టిన చెమట తుడుచుకుంది శ్రావణి.

"తాగుడు అలవాటున్నవాళ్ళకు రూమ్‌లో ఫ్రిజ్ కావాలిగానీ మన రూప రూమ్‌లో ఎందుకు ?" తేజా చప్పున అంది.

నేను సర్దాను. ఇప్పటికే శ్రావణి బాధపడ్తోంది. ఇంకా ఆ అబ్బా యికి చెడ్డగుణాలున్నాయేమో అనే శంక తనలో రాకూడదని ....

"ప్రిస్టేజిలే తేజా అంతే, ఇంకేమీకాదు."

"అవునూ. ఫర్నీచర్ ఇంతకు పెడ్తామని ముందు మీరు మాట్లాడు కోలేదా శ్రావణీ" దివ్య అడిగింది మంచినీళ్ళ గ్లాసు అందుకుంటూ.

"బిందు అన్నట్లు మా ఆయన అక్కడ ప్రిస్టేజ్ ఫీల్ అయ్యారు. మనం తీసిచ్చే వస్తువులు గొప్పగానే వుంటాయికదా! ఇక అడిగేది, చెప్పేది ఏవిటిలే అనుకున్నారు. ఇప్పుడేమో మేము టేప్‌రికార్డర్‌కి కాంపాక్టుడిస్కు ప్లేయర్ యివ్వలేకపోతిమి."

"అంటే ఏవిటీ ?" ఆశ్చర్యంగా అడిగాను.

"ఏముందీ ! పెద్ద సౌండ్‌లో సుపీరియర్ క్వాలిటీ, సౌండ్‌లో లేటెస్ట్ ఇన్వెన్షన్ అట.

"అర్ధమయ్యేలా చెప్పు కాస్త."

"నా కర్థమయితేకదా నీకు చెప్పడానికి, అదేదో కేన్‌వుడ్ కాంపాక్ట్ డిస్కు సిస్టమ్ అట అది నలభై వేలట."

"ఏమిటీ ? నలభై వేలా అదీ టేప్‌రికార్డర్ మీద మాలాటివాళ్ల ఒక పెళ్ళి చేసేస్తారా డబ్బుతో.

"ఇక్కడ డబ్బు క్వొశ్చన్‌కాదట ప్రిస్టేజ్ క్వశ్చిన్ అట - బజారులో ఏ కొత్త మోడల్ వుంటే అదే కొనివ్వాలట."

"అలా అయితే థౌజండ్ సి.సి కంటే మనీ ఎక్కువలో ఇంకా ఎన్నో కార్లు రోవర్, మాంటిగో, ఎస్టేట్, లేన్సర్, ఫోర్డ్, బెంజ్ లాంటివి పది లక్షల్లో వున్నాయిగా అవి అడగలేదా ?"

"ఊహూ వాళ్ళడిగింది మారుతి అందులో పెద్ద మోడల్ వుండా లంతే."

"వాళ్ళకి డబ్బుంటేవాళ్ళు కొనుక్కోవాలి, అంతేకానీ చీప్‌గా అలా అడగడం ప్రిస్టేజికి భంగం కాదా ?" వెళ్ళగక్కాను నేను.

"మగపెళ్ళివాళ్లుకదా !" దివ్య చిరాగ్గా ముఖంపెట్టి అంది.

"ఓహో! ఇంతకీ ఆ మగపెళ్ళి మహారాజులకి, సేవకులు మీరేం జవాబు చెప్పుకున్నారో" .... శ్రావణి వైపు తిరిగి అడిగాను.

"ఏముంది? వాళ్ళ కోర్కెలన్నీ తీరుస్తామన్నాము, మేము మర్చిపోయి వాళ్ల గుర్తు చేసిన వీడియో కెమెరా కూడా— "

మొత్తానికి శాంతింపజేసి వచ్చారన్నమాట, దుర్గముందు మేకను బలిస్తానన్నట్టు."

"నో బిందూవాళ్లు శాంతించరు. వాళ్ళకు కావాల్సింది నిజానికి ఆ వస్తువులుకాదు - కేవలం ఆడ పెళ్ళివాళ్ళం కనుక మేము వాళ్ళముందు చేతులు కట్టుకుని నిల్చోవాలి .... అంతే .... అదే .... అదే చేయలేకపోతున్నాం."

"అంటే.... " నా కనుబొమలు ముడిపడ్డాయి.

"మా ఆత్మాభిమానం వాళ్ళకు గర్వంగా, మేము మా అమ్మాయిమీద చూపించే ప్రేమ విడ్డూరంగా, వాళ్ళను తప్ప మరొకర్ని గౌరవించడం, మర్యాద చేయడం .... అది వాళ్ళకవమానంగా ఎన్నని చెప్పనులే మేము చేయలేనివి అడుగుతున్నారు ఆలోచించి మరీ" నిట్టూర్చింది నిస్పృహగా శ్రావణి.

"పెళ్ళిళ్ళల్లో ఇవి సహజమే అన్నీ సర్దుకుపోతాయిలే నువ్వు ఫీల్ అవకు."

"ఏవిటో బిందూ తీరా మేము తలబద్దలు కొట్టుకుని 'ఇలా చేస్తే సంబరపడిపోతారు' అని ఊహించి ఏదో చేయడం. వాళ్ళు దాంట్లో తప్పులు వెతకడం ..... వాళ్ళ దృష్టిలో మేము ఏమి చేసినా తప్పేలే". అని - నిట్టూర్చి,

"అదేమి ఖర్మమో! మేము చేసే ప్రతిదీ వాళ్ళని అవమానించడానికి

చేసినట్లనిపిస్తోంది - ఈ రోజు పాపతో నువ్వు చూడలేదేమో! వెండిమీద అమెరికన్ డైమెండ్స్ మంచి పచ్చలు, రుబీస్ వేయించి నెలముందు నుండి అర్డర్ చేసి స్పెషల్‌గా లక్ష్మీదేవి పటం తయారు చేయించాను - వాళ్ళు గొప్పగా మెచ్చుకుంటారనుకున్నాను."

"ఏం నచ్చలేదా ?" ఈ మారు తేజాలో ఆశ్చర్యం.

"అదే బాధగా వుంది తేజా! వాకిట్లోనే మా నిరూ అత్తగారి అక్కగారి ముఖం మలినమయిపోయింది - నాకప్పుడే అర్థమయింది ఏదో గొడవ లేవదీస్తారని వాళ్లు. ఊహించినట్టుగానే మేము చిన్న వెండి దైవ మందిరంలో వెండి లక్ష్మీదేవిని పెట్టిఇవ్వలేదట" శ్రావణి ఎంత సహజంగా వుండాలని ప్రయత్నిస్తున్నా, ఆమె గొంతులో తడి.—

"గుడి కట్టిద్దువుగానీ వూర్కో. వాళ్ళగొంతెమ్మ కోర్కెలు తీరుస్తూ పోతే వాటికి అంతుండదు" నా సిద్ధాంతాన్ని మరొక్కసారి ఇక్కడ వదిలాను

"అప్పటికీ ఈయన పర్మిషన్ లేకుండా మా పూజ గదిలోని పెద్దోళ్ళకాలంనాటి వెండి ముద్దలతో చేసిన మందిరం యిస్తానని మాటిచ్చేసాను."

"అప్పటికీ వాళ్లు శాంతించలేదా ?"

"కరెక్ట్ అదే జరిగింది. పాత వెండి మందిరం వాళ్ళకిస్తానని చెప్పి వాళ్ళ నవమానించానట."

"వెండికి పాతేమిటి? కొత్తేమిటీ? మెరుగేస్తే కొత్తదయిపోదూ! పైగా అనాటి వెండి క్వాలిటీ ఈరోజు రమ్మన్నా వస్తుందా? అ..నా నేనెక్కడా వినలేదే వెండి మందిరంలో లక్ష్మీదేవిని పెట్టి తీసుకెళ్ళడం ?" ఈమారు తేజా నోరెళ్ళబెట్టింది -

"అన్నీ కొత్త పద్ధతిలో జరగాలట అందరికి జరిపినట్లు వాళ్ళకి జరిపితే వాళ్ళ గొప్పతనం తగ్గిపోతుందంట."

"ఓహో ! అదా ! మరయితే నిరూప అత్తగారింట్లో అందరూ బంగారు బిస్కెట్లు ఎవ్వరూ తిననివి తినొచ్చుగా" అక్కసుగా అంది దివ్య.

"పూర్కొవే పాపం వాళ్లు వీలయివుంటే తినేవాళ్ళే - పళ్లు విరిగి పోతాయని భయపడ్డట్టున్నారు" మనస్సు భారాన్ని దించుకోవడానికి జోక్ వేసాను.

"ఓ. కె మరి అందరూ తినే బియ్యమే వండుకోవడమెందుకు ? వెరైటీగా ఇంకేదైనా తిని బ్రతకొచ్చుగా."

"పలావు బియ్యం తింటారు కాబోలులే" సర్దింది తేజ.

"వాళ్లు పలావు బియ్యంకాదు మా మనశ్శాంతిని తింటున్నారు. ఏమాట కామాట చెప్పుకోవాలి వాళ్ళ పట్టుదల కోసం, వాళ్ళమాట నెగ్గడం కోసం వాళ్ళ మనశ్శాంతిని కూడా ఖర్చుపెట్టుకుంటారు పాపం."

"పోనీలేవే వాళ్ళడిగింది పారేయండి. మీరు సంపాయించేదంతా నిరూప, స్వరూపల కోసమేకదా !" దివ్య సానుభూతిగా చూస్తూ అంది.

"అలా అనకు దివ్యా ! శ్రావణికి డబ్బుంది పారేస్తుంది. మాబోటి వాళ్ళకదే పెద్ద సమస్య. కట్నం ఇవ్వడంలో మొదట అప్పులపాలవుతాం - తర్వాత అత్త, ఆడబిడ్డల కట్నాలతో అగాధంలోకి కూరుకుపోతున్నాం. అందులోనుండి కొద్ది కొద్దిగా బయటపడే సమయానికి ఇవిగో ఈ పండగ లొచ్చి దాపురిస్తాయి మా ప్రాణానికి, అసలీ సాంప్రదాయాలెందుకు పెట్టారో ! పెళ్ళి పేరుతో, పండుగ పేరుతో, పురుడు పేరుతో ఆడపిల్లని కన్న తల్లిదండ్రుల ఆనందాలు పూర్తిగా హరించుకు పోతున్నాయి."

నా బాధను పట్టించుకోలేదు శ్రావణి.

"మా మధ్య వచ్చిన కలతలు డబ్బుతో వచ్చినవికావు ఎప్పుడో మేము తెలీక వాళ్ళనెందుకో చిన్నబుచ్చామట. దానికి వాళ్లు తీసుకుంటున్న ప్రతీకారం ఇది. మేము ఏమి మాట్లాడినా పెడర్థమే - ఎంత పెట్టినా అసంతృప్తే, ఏమి చేసినా తప్పే, ఏ అడుగేస్తే ఏమవుతుందోనని భయపడి చస్తున్నాం, ఎంతఆలోచించి ఏపని చేసినా, దానికి వంకలుపెట్టి మాకళ్ళల్లో నీళ్ళు చూస్తేకానీ వాళ్ళకు తృప్తి కలగడంలేదు. వాళ్ళ కాళ్ళు పట్టుకుని క్షణ క్షణం చేయని తప్పుకు మేము క్షమాపణలు అడుగుతుంటే అప్పుడు మాత్రం వాళ్ళు ఆనందంగా వుంటారు."

"అయితే ఎప్పటికప్పుడు క్షమించేస్తుంటారన్నమాట."

"ఆఁ ...ప్రతి మనిషిలో వుండే క్షమించేగుణం వాళ్ళ రక్తంలోనే లేదు. ఎంతసేపటికీ వాళ్ళెన్ని తప్పులు చేసినా ఆడపిల్లల్ని కన్నవాళ్ళం కదా మేము మర్చిపోతూ వుండాలి. వాళ్ళకు బానిసలుగా వుండాలి. అదీ వాళ్ళు కోరేది. మగ పెళ్ళివాళ్ళు కదా ! వాళ్ళ కాళ్ళక్రింద బానిసబ్రతుకు మేము బ్రతకలేకున్నాము అదే మేము చేసిన తప్పు ...., అంతా మా ఖర్మ."

ఆఖరకు తేల్చేసింది శ్రావణి.

"అందరి ఖర్మలూ అలాగే తెల్లారాయిలే. నువ్వు ఒక్కదానివే దిగులుపడకు, ఆ పనేదో ఉమ్మడిగా చేద్దాం" వాతావరణాన్ని తేలికచేసే ఉద్దేశంతో దివ్య వేసిన ఛలోక్తికూడా శ్రావణిని తాకనట్టుంది. ఆమె నవ్వలేదు.

"అసలు తప్పు మనది" సాలోచనగా అన్నాను నేను.

తృళ్ళిపడ్డట్టు చూసింది శ్రావణి.

"నిజం మనం ఒక్కొక్కరం ఒక్కోరకం తప్పుచేసాం. నేను ఉద్యోగస్థుడు దొరికాడు చాలు అని నా అంతస్థుతో నా అల్లుడి అంతస్థు పోల్చుకుని, తృప్తిపడి పిల్లను తోలేసానుగానీ 'నా అల్లుడు మార్వాడీలా నన్ను పీక్కుతినే రకమా ? లేక వున్నంతలో తను తిని, భార్యను పోషించుకునే రకమా ?' అని నా అల్లుడి ఏ కోరికా తీర్చలేని నేను ఆలోచించలేదు."

"నో ... బిందూ ! దట్స్ ఇంపాజిబుల్, పళ్ళికిలిస్తూ పరమసాత్వికుడిలా కనిపించే పెళ్ళికొడుకు మనసులో ఏ కుళ్ళు ఆలోచనలున్నాయో ! ఏ యంత్రంపెట్టి కనుక్కోగలం ?" తేజా ఖండించింది నన్ను.

"ఏం వాడి వెనక ఎన్ని ఆస్థులున్నాయి ? వాడి పేరుముందు ఎన్ని డిగ్రీలున్నాయి, వాడి ఆరు తరాల తాతల జీవితచరిత్రలు – ఎలాంటివి ? వీటిగురించి ఏ కంప్యూటర్ ద్వారా తెల్సుకుంటున్నాము మనం ? ఆ పెళ్ళికొడుకు ఎలాంటివాడో, అనే విషయాన్ని మాత్రం తెలుసుకోడానికి కనీస ప్రయత్నమయినా ఎందుకు చేయం మనం ?"

"ఏయ్ బిందూ ! ఊరికే ఆవేశపడి ఆయాసపడకు. మన ఇనుప పెట్టెలో పెళ్ళికొడుక్కివ్వడానికి కట్నం డబ్బులమూట మూలుగుతుంటే అప్పుడు మనకి వాటన్నిటి గురించి ఆలోచించే హక్కు వుంటుంది" దివ్య అంది. నడుము నొప్పేమో కాస్త సర్దుకుని కూర్చుంటూ –

"మన విషయం వదిలెయ్ శ్రావణిని గుండెలమీద చెయ్యి వేసుకుని నిజం చెప్పమను తమ పెళ్ళికొడుకు అలవాట్ల గురించిగానీ, అతని మనస్తత్వం గురించిగానీ, అతని సభ్యతా సంస్కారాల గురించీగానీ, అతని అభిరుచుల గురించిగానీ ఆలోచించిందేమో !"

"నిజమే ! నువ్వు చెప్పిందీ నిజమే "నిట్టూర్పు విడిచింది శ్రావణి

"నా గురించి చెప్పలేదు నువ్వు ?" దివ్య నవ్వుతూ నన్ను రెచ్చ గొట్టింది. ఎన్ని కష్టాలన్నా వుండనీ, వాటిని గరళకంఠుడిలా మింగేసి మనస్ఫూర్తిగా చిరునవ్వు నవ్వగలదు దివ్య.

"నీ గురించి చెప్పడానికి చాలావుంది."

"అమ్మో ! అయితే ఇదిగో ఈ కూల్ వాటర్ త్రాగి, అలుపు తీర్చు కుని, కాస్త కూల్‌గా చెబ్దూ నా తప్పేమిటో తెలియక ఛస్తున్నాను."

"నీ తప్పు నీకు తెలియకపోవడమేమిటీ ? నువ్వు గుర్తు చేసుకోవ డానికి భయపడుతున్నావుగానీ"

"చెప్పు. చెప్పు. ఇదిగో ఈ ఆపిల్ పండు తిని మరీచెప్పు లేకపోతే నా బతుకు సీరియల్ నవలని మా ముందు చదవడానికి నీకు శక్తి చాలదు."

అందించిన ఆపిల్ ప్రక్కన పెట్టాను.

నాకు నిజంగా నా కడుపులో బాధ కక్కేయాలనుంది ఈ సమా జాన్ని అందులో మనుష్యుల్ని కడిగేయాలనుంది.

"దివ్యా ! నీకు ఇద్దరు కూతుళ్ళు, ఒక కొడుకు నువ్వేమీ అనుకోక పోతే నీ ఆస్థి మొత్తానికి నాలుగుతో హెచ్చిస్తే ఎంతవుతుందో అంత ఆస్థి నీ ఒక్క అల్లుడికే వుంది. అలాంటివాడిని సెలెక్ట్ చేసుకుని ఇప్పుడు వాళ్ళ అంతస్థుకుతగ్గ కోరికలు వాళ్ళు కోరితే అవి తీర్చలేక నువ్వు నలిగిపోవడం లేదూ ! అదే నీకు తగ్గవాడిని నీకు అల్లుడిగా తెచ్చుకోనుంటే ఏమో ! ఆ అల్లుడు నీకు, నీ కుటుంబానికి అండగా నిల్చి నీకు మనశ్శాంతి నిచ్చే వాడేమో!"

"అన్నీ ఏమోలే—అవునా బిందూ ? నువ్వూ ఖచ్చితంగా చెప్ప

లేకపోతున్నావు. అందుకే ఆడపిల్ల అదృష్టాన్ని మేము కాలానికి, ఖర్మానికి వదిలేస్తున్నాము."

"అదే....అదే నాకు ఒళ్ళుమండేది. జీవితాలన్నీ గాంబ్లింగ్. కాద నను కానీ మనవంతు ప్రయత్నం మనం చేయకపోతే ఎలా ?"

"చేసి ఏం లాభంలే. నా కూతురు నా మాట వింటుందా ఇప్పుడు ? ఎవరిఖర్మ కెవరు బాధ్యులు ?" తేజా దిగాలుగా అంది.

"ఈ ఖర్మసిద్ధాంతం మనల్ని బాగుపడనివ్వదు. మొదట మన జాతి చరిత్రలోనుండి, మన డిక్షనరీలోనుండి ఆ ఖర్మ సిద్ధాంతాన్నితీసి విసిరి పారేయ్యాలి."

"ఆపు తల్లీ నీ లెక్చర్ ఆపు. అసలే అల్లుడి బాధితులం ఇంకా ఎందుకు బాధపెడ్తావు నువ్వు మమ్మల్ని."

"లేదు దివ్యా ! బిందు చెప్పింది చాలా నిజం, ఒప్పుకుంటున్నాను కానీ బిందూ ! నా కర్థంకాంది ఇంకొకటుంది. ఎవరైనా ఏదైనా ఇస్తానన్నా తీసుకోవడానికి మొహమాట పడ్తాంకదా ! తీసుకోవాలని మనసులో వున్నా....అలాటిది ఈ పెళ్ళికొడుకు తల్లులు, తండ్రులు ఎంత మొగ మాటం లేకుండా నా కిది కావాలి, అది కావాలి అని ఎలా అడగ్గలరు ? నీ వియ్యంకులు, నా వియ్యంకులే కాదు ప్రతి వియ్యంకులు నిస్సంకో చంగా, నిర్లజ్జగా ఎలా అడగగలుగుతున్నారంటావ్ ?" కాస్త ముందుకి వంగి అంది శ్రావణి.

ఆమె అన్నదీ నిజమే. ఒక మనిషి తప్పు చేసినా, మనల్ని నష్ట పర్చినా, ఒక పట్టాన మోహాన అడగలేని మనం మనకు కలకాలం చుట్టా లయిన వియ్యంకుల తప్పులు వెతికి నిలదీసి ఎలా అడగ్గలుగుతున్నాం ? ఎక్కడుందీలోపం ? ఎవరిచ్చారీ ధైర్యం ?

"మగ పెళ్ళివాళ్ళకు పట్టం కట్టిన సమాజం ఇస్తోందా ధైర్యం ! అక్కడే వుంది లోపం— ఈ ఎలక్ట్రానిక్ యుగంలో ఇన్ని కొత్త కొత్త మెరుపులు చమక్‌మంటున్నాయి కదా ! యమ్. టి. వి.లు, జీ టి. వి. లులా మనసులో మర్మాన్ని కనుక్కునే మెషీన్ ఏ పుణ్యాత్ముడైనా కన్పెడ్తే ఎంత బాగుణ్ణు."

దివ్య నవ్వుతాలుగా అంది.

"కానీ నిజానికి అలాటిదేవస్తే ఈ దేశంలో సగంమందికి పెళ్ళిళ్ళే కావు. మన చిరునవ్వుల వెనకాల అంత కల్మషం వుంది."

పెళ్ళి, పండగ, పురుడు అనేవి చాలా సంతోషంగా జరుపుకోవాల్సిన శుభకార్యాలు. కానీ పెళ్ళిళ్ళల్లో పెళ్ళికూతురు తల్లి దండ్రులు నవ్వే నవ్వులో జీవం వుంటోందా ? పండగరోజు కూతుర్ని, కొత్తల్లుణ్ణి ఆహ్వానించే తలిదండ్రుల పెదవుల పిలుపు వెనక 'వాళ్ళొవస్తే బావుణ్ణు'అని గంతులేసే ఆనందపు జల్లు వాళ్ళ గుండెల్లో కురుస్తోందా ? తన కూతురు తల్లి అయిందనే ఆనందం వెనక వేదసలేని తలిదండ్రులున్నారా ?

లేదు.

ఎందుకని ? ఎందుకని ? ఎందుకని ?

'వియ్యంకుల కోర్కెల బరువు ఎంత వుంటుందో ? దాన్ని మోయగలమా?' అనే భయం, ఆవేదన వాళ్ళ సహజ సంతోషాన్ని చంపేస్తోంది. జీవిత సరిగమలు అపశృతులు పలుకుతున్నాయి.

శ్రీ వి. శ్రోక్ వ్యాపక గ్రంథాలయము
F. 22161